ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 13 మే 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 40.0 26.0



• తెల్లారింది లెగండోయ్...

ఐదేళ్ల పాలన చూశారు..! అంతకు మునుపు ఐదేళ్ల పాలనా చూశారు..! అరాచకాలకు, అభివృద్ధికి తేడాలను గమనించారు. మరో ఐదేళ్ల భవితకు పునాది వేసుకునేందుకు సిద్ధమయ్యారు. పోస్టల్ బ్యాలెట్‌లో పోటెత్తి ఓటేసి.. స్పష్టమైన సంకేతాలను పంపించారు. ఈవీఎంల మీట నొక్కేందుకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు విజేతగా నిలిచే సమయం ఆసన్నమైంది. అభ్యర్థుల భవితవ్యం అటుంచితే.. ప్రజాస్వామ్యాన్ని బతికించుకునే బాధ్యత ఓటరుదే. 'తెల్లారింది లెగండోయ్.. కొక్కొరోక్కో..' అంటూ.. ఓటేసేందుకు తాము వెళ్లడంతో పాటు.. ఇరుగూ పొరుగునూ తట్టిలేపి తీసుకెళ్లాలి. పోలింగ్ కేంద్రాలు కళకళలాడాలి. ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి. భవితను మార్చుకోవాలి. అభివృద్ధికి బాటలు వేసేవారిని గురిచూసి ఎన్నుకోవాలి.



ఐదేళ్ల భవితకు ఓటే పునాది



అనంతపురంలోని జూనియర్ కళాశాలలో రాప్తాడు నియోజకవర్గం ఎన్నికల సామగ్రి పంపిణీ..

ఓటెత్తి.. జై కొట్టు..!

నేడు జిల్లా వ్యాప్తంగా పోలింగ్

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకూ..
- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాట్లు
- ఎన్నికల సామగ్రితో తరలిన పోలింగ్ సిబ్బంది



సిబ్బంది హడావుడి...



అనంతపురం/టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు జిల్లాలో అనంతపురం లోక్‌సభతో పాటు రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,97,792, మహిళా ఓటర్లు 10,20,124 మంది, థర్డ్ జెండర్లు 246 మంది ఉన్నారు. అనంతపురం లోక్‌సభకు 21 మంది, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 113 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సార్వత్రిక పోరుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
రాయదుర్గం	1,30,794	1,33,516	42	2,64,352
ఉరవకొండ	1,10,540	1,13,771	28	2,24,339
గుంతకల్లు	1,32,943	1,37,630	75	2,70,648
తాడిపత్రి	1,23,496	1,25,358	26	2,48,880
శింగనమల	1,22,927	1,24,417	29	2,47,373
అనంతపురం అర్బన్	1,37,708	1,43,479	27	2,81,214
కళ్యాణదుర్గం	1,14,356	1,16,422	07	2,30,785
రాప్తాడు	1,25,028	1,25,531	12	2,50,571
మొత్తం ఓటర్లు	**9,97,792**	**10,20,124**	**246**	**20,18,162**





రాప్తాడు నియోజకవర్గం ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్




అనంతపురం నియోజకవర్గం ఈవీఎంల పంపిణీ పరిశీలనకు వచ్చిన ఎస్పీ అమిత్ బర్దర్

వారికి ప్రత్యేకం

దివ్యాంగులు, మహిళలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో దివ్యాంగ ఓటర్లకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గుత్తిరోడ్డునందుగల మాంటెస్సోరి ప్రైవేటు పాఠశాలలోను, శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం చింతర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. మహిళలకు నార్పల మండలం కేశేపల్లి, రాయదుర్గం పట్టణంలోని పీఎస్‌నెంబరు 187 ప్రభుత్వ హైస్కూల్, ఉరవకొండ పట్టణంలోని కరిబసప్పస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంతకల్లు పట్టణంలోని రోటరీ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, తాడిపత్రి నియోజకవర్గంలో కావేటి సముద్రం మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల, అనంతపురం నగరం తపోవనం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కళ్యాణదుర్గం పట్టణంలోని నార్త్ మండల పరిషత్‌ప్రైమరీ పాఠశాల, చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. యువ ఓటర్ల కోసం ఉరవకొండలోని సెంట్రల్ ఉన్నత పాఠశాల, బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

2,236 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి 2,236 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వినోద్ కుమార్ రాష్ట్ర కమిషన్‌తో మాట్లాడి ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయించారు. జిల్లాలో తొలుత 1032 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. కలెక్టర్ పోలీస్ శాఖతో పూర్తి సమాచారం తీసుకొని ఇందులో 692 మరింత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ కేంద్ర బలగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 22 వేల మంది పోలీసు సిబ్బంది, 12 కంపెనీల కేంద్ర బలగాలతో భద్రత కల్పించారు



ఊరిదావ..!

పల్లె బస్సు ఫుల్..

ఎదురు చూస్తున్న క్షణం వచ్చేసింది. ఓట్ల పండగకు పల్లె, పట్నం, నగరం సిద్ధమైంది. ఊరూరా సందడి నెలకొంది. ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన సొంతూరుకు సంక్రాంతికి వచ్చినట్లు వచ్చేశారు. ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. రద్దీకి తగినన్ని బస్సులు లేక.. చాలామంది టాప్‌పై ఎక్కి ప్రయాణించారు.




నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
రాయదుర్గం	296
ఉరవకొండ	263
గుంతకల్లు	276
తాడిపత్రి	274
శింగనమల	293
అనంతపురం అర్బన్	292
కళ్యాణదుర్గం	261
రాప్తాడు	281
మొత్తం	2,236

రెడీ రెడీ..

అభ్యర్థుల భవితవ్యం తేల్చడానికి ఓటింగ్ సమయం వచ్చేసింది. పోలింగ్ నిర్వహణకు పీఓలు 2,472 మంది, ఏపీఓలు 2,552 మంది, ఓపీఓలు 10,208 మంది చొప్పన15,232 మంది సిబ్బందిని నియమించారు. వారంతా ఆదివారం ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనంతపురం అర్బన్, ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో శింగనమల, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల లో రాప్తాడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఇతర సామగ్రిని పంపిణీచేసి తరలించారు. రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గ కేంద్రాలలోనే సిబ్బందికి అందజేసి పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ మొదలై సాయంత్రం 6గంటల వరకు కొనసాగిస్తారు. సాయంత్రం 6గంటలలోపు క్యూలో ఉంటే ఆ ఓటర్లు ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగిస్తారు. జిల్లా ఎన్నికల పరిశీలకుడు మనీష్ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రిని కేంద్రాలకు ప్రత్యేక వాహనాలలో తరలింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని, ప్రతిఒక్కరు నిర్భయంగా కేంద్రాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో పోలింగ్‌కు ఎవరైనా అవాంతరాలు కలిగించినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిల్లా ఓటర్లు	20,18,162
పురుషులు	9,97,792
మహిళలు	10,20,124
థర్డ్ జెండర్	246
పోలింగ్ కేంద్రాలు	2,236
సమస్యాత్మక కేంద్రాలు	692



దమ్ముంటే కాయ్..!



ప్రభుత్వం కూటమిదే.. రూ.కోట్లు కడతాం..
లేదు.. మరోమారు వైసీపీదే.. మేమూ సై..
ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్‌ల జోరు
ప్రభుత్వం.. అభ్యర్థులపై పందేలు
ఉరవకొండలో పందెం కాసేందుకు జంకు

అనంతపురం, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమిదే అధికారం అని కొన్ని, మరోసారి వైసీపీదే అధికారమని మరికొన్ని సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌ల జోరు పెరిగింది. పోలింగ్‌కు ముందే పందెంరాయుళ్లు కాయ్ రాజా కాయ్ అంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపైనే ఎక్కువగా పందేలు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.100 కోట్లకు పైబడి పందేలు కాసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎంపీ అభ్యర్థులపైనా పందెం కాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందుతారని ఎక్కువ మంది పందెం కాస్తున్నారు. వైసీపీ, టీడీపీకి ఒక్కో స్థానం వస్తాయని మరికొందరు బెట్టింగ్‌కు దిగుతున్నారు. కూటమి, వైసీపీకి చెందిన కొందరు నాయకులు బెట్టింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది.

పొరుగువారూ వాలిపోయారు..

తాడిపత్రి నియోజకవర్గంలోనూ పందేలు జోరందుకున్నాయి. కూటమి అభ్యర్థి గెలుపొందుతారని ఆ నియోజకవర్గంలోని పరిశ్రమల నిర్వాహకులు పెద్ద ఎత్తున బెట్టింగ్ కాస్తున్నారు. ఇప్పటికే రూ.5 కోట్ల దాకా పందేలు జరిగినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. కడప జిల్లాకు చెందిన కొందరు వైసీపీ వర్గీయులు తాడిపత్రి ఫలితంపై బెట్టింగ్ కాసినట్లు సమాచారం. ధర్మవరంలోనూ కూటమి అభ్యర్థి గెలుపొందుతారని రూ.7 కోట్ల దాకా స్థానిక వ్యాపారులు పందెం కాసినట్లు సమాచారం. ధర్మవరంలో కూటమి అభ్యర్థి కొత్త వ్యక్తి కావడంతో పందెం రాయుళ్లు ఉత్సాహాన్ని చూపుతున్నట్లు తెలుస్తోంది. గుంతకల్లులోనూ కూటమి అభ్యర్థి గెలుపొందుతారని కొందరు.. లేదని మరికొందరు పందెం కాస్తున్నారు. ఇక్కడ రూ.3 కోట్లకుపైగా బెట్టింగులు జరిగినట్లు సమాచారం. రాయదుర్గంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. కూటమి అభ్యర్థే గెలుపొందుతారనే మెజార్టీ బెట్టింగ్ రాయుళ్లు పందెం కాసినట్లు సమాచారం. సరిహద్దులోని బళ్లారి జిల్లాకు చెందిన కొందరు బెట్టింగ్ రాయుళ్లు రాయదుర్గంలో మకాం వేసి బెట్టింగుల జోరు పెంచినట్లు సమాచారం. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ కాయ్ రాజా కాయ్ అంటున్నారు.

రూ.కోట్లలో పందేలు..

జిల్లాలో కీలకంగా మారిన అనంతపురం అర్బన్, రాప్తాడు, ధర్మవరం, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాలపైనే అత్యధికంగా బెట్టింగులు జరుగుతున్నాయి. అనంతపురం అర్బన్‌లో కూటమి అభ్యర్థి గెలుపొందుతారని రూ.7 కోట్ల దాకా పందెం కాసినట్లు సమాచారం. లేదు.. వైసీపీ అభ్యర్థే గెలుపొందుతారని అదే స్థాయిలో సై అంటున్నట్లు తెలిసింది. రామ్‌నగర్‌లోని ఓ హోటల్ కేంద్రంగా ఈ వ్యవహారం సాగుతోంది. రాప్తాడులో కూటమి అభ్యర్థే గెలుస్తారని పెద్ద ఎత్తున బెట్టింగులు నడుస్తున్నాయి. కోస్తాంధ్రకు చెందిన కొందరు రాప్తాడుపై అత్యధికంగా రూ.10 కోట్లకుపైగా బెట్టింగ్ కాసినట్లు తెలుస్తోంది. క్రికెట్ బుకీలే పొలిటికల్ బెట్టింగ్ రంగంలోకి దిగినట్లు సమాచారం.

వద్దులేప్పా..

ఉరవకొండలో కూటమి అభ్యర్థి గెలుపొందుతారని కూటమి అనుకూలురు పందెం కాసేందుకు ముందుకు వస్తున్నారు. కానీ ఎదురు పందెం కాసేందుకు చాలామంది జంకుతున్నట్లు సమాచారం. వైసీపీ అభ్యర్థికి ఇంటిపోరుతో పాటు సొంత పార్టీలోనే అసమ్మతి తారస్థాయిలో ఉంది. అభ్యర్థి తనయుడిపై అక్రమాల ఆరోపణలు భారీగా ఉన్నాయి. అందుకే వైసీపీ అభ్యర్థి గెలుస్తారని పందెం కాసేందుకు చాలామంది జంకుతున్నారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పక్షాన వైసీపీ అభ్యర్థి సోదరుడు పోటీలో ఉన్నారు. ఆయన చీల్చే ఓట్లన్నీ అధికార పార్టీవారివే. అందుకే కూటమి అభ్యర్థికి లాభించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కూటమి అభ్యర్థి గెలుపుపై పందెం కాసేందుకు పోటీ పడుతున్నారేగాని.. ఓటమి గురించి ఆలోచన కూడా చేయడం లేదు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్. కూటమి అభ్యర్థే గెలుస్తారనే ధీమాతో కొందరు బెట్టింగ్ రాయుళ్లు రూ.కోటి పందెం కట్టేందుకూ వెనుకాడటం లేదని తెలుస్తోంది.

పోలింగ్ నిర్వహణ కత్తిమీద సాము


తాడిపత్రి, రాప్తాడు, ఉరవకొండ.. సమస్యాత్మకం
వైసీపీ కవ్వింపులు.. బెదిరింపులు ఇక్కడ కామన్
భారీగా పోలీసు భద్రత.. అయినా అనుమానాలు

శాంతి.. భద్రమేనా..!

అనంతపురం క్రైం, మే 12: జిల్లాలో పోలింగ్ నిర్వహణ పోలీసులకు సవాలు కానుంది. శాంతిభద్రతలకు విఘాతంగా కలగకుండా వారు ఏ మేరకు చర్యలు తీసుకోగలరనేది చర్చనీయాంశంగా మారింది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు వైసీపీ నేతలు కుయుక్తులు పన్నుతున్నట్లు సమాచారం. ఎక్కడైనా తేడా కొడితే అల్లర్లు సృష్టించాలని కొందరు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. జిల్లాలోని రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాలపైనే అందరి దృష్టి ఉంది. ఇక్కడ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు, ప్రలోభ పెట్టడానికి అనేక విధాలుగా ఇప్పటికే ప్రయత్నించారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోలింగ్ జరిగే సుమారు 12 గంటల పాటు ఎలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదే. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణాన్ని వారే కల్పించాల్సి ఉంది.

అధికారం - పోలీస్ - కేసులు

వైసీపీ నేతలు ఐదేళ్ల పాటు తమకు నచ్చిన, అనుకూలంగా ఉన్న, పార్టీ సామాజికవర్గానికి చెందిన పోలీసు అధికారులకే పెద్దపీట వేసింది. టీడీపీ వర్గీయులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల పరంపర కొనసాగించారు. సామాన్యులను సైతం భయభ్రాంతులకు గురి చేశారు. అయినా పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన కేసులో నిందితుడు ఎర్రిస్వామిని రాచమర్యాదలతో జైలుకు పంపారు. దాడిలో పాల్గొన్న కనగానపల్లికి చెందిన బండి రవి, కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన అశోక్‌ను టచ్‌కూడా చేయలేదు. పరారీలో ఉంటూనే.. టీడీపీ కార్యకర్తలపై బండి రవి దాడి చేసి.. పోలీసులు తనకు ఇచ్చిన 'స్వేచ్ఛ' ఏ స్థాయిదో చూపించాడు. ఆత్మకూరు మండలంలో ఇంటికెళ్లి టీడీపీ కార్యకర్త వన్నూరును బెదిరించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి తనకేమీ సంబంధం లేనట్లు వ్యవహరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అరాచకాలు ఉన్నాయి.



ఒకరికి మించి ఒకరు..

ఎస్పీ ఫక్కీరప్ప ఉన్నన్నాళ్లూ వైసీపీతో అంటకాగారు. ఆ తరువాత వచ్చిన ఎస్పీ శ్రీనివాసులుపై 'వైసీపీ' డీఐజీ అమ్మిరెడ్డి పెత్తనం చెలాయించారు. ఇక కడప నుంచి నేరుగా వైసీపీ రంగులు పూసుకుని మీర అన్బురాజన్ వచ్చారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినట్లు వ్యవహరించి.. పోలీసు శాఖకు మచ్చ తెచ్చారు. డీఐజీ అమ్మిరెడ్డి.. రెడ్డి సామాజికవర్గం పోలీసులనే ప్రోత్సహించారు. ఎన్నికల ముందు టీడీపీకి అనుకూలంగా ఉంటారనే నెపంతో కొందరిని స్టేషన్లలో ఉంచకుండా చెక్‌పోస్టులకు పంపారు. తాడిపత్రి డీఎస్పీగా ఉన్న చైతన్యకుమార్ అరాచకాలు ఏ స్థాయిలో సాగాయో తెలియంది కాదు. అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి మూడేళ్లు కరడుగట్టిన వైసీపీ అధికారిగా పనిచేశారు. వైసీపీ నాయకుడిపై జరిగిన దాడి కేసులో సంబంధం లేని టీడీపీ నాయకులను చేర్చారు. ఆయనతోపాటు ఎస్పీ అన్బురాజన్, డీఐజీ అమ్మిరెడ్డిపై ఈసీ వేటు వేసింది.

ఆ మూడే కీలకం...

రాప్తాడు నియోజకవర్గంలో గొడవలు తప్పవని స్పష్టమవుతోంది. ఇంతకాలం పోలీసులు వైసీపీకే అనుకూలంగా వ్యవహరించారు. కనీసం పోలింగ్ రోజైనా ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తారా..? అనేది తేలాల్సి ఉంది. తాడిపత్రి సైతం ఈసారి హాట్ హాట్‌గానే ఉంది. అక్కడి నేతలు సవాళ్లు.. ప్రతి సవాళ్లతో వేడి రగిల్చారు. ఉరవకొండలోనూ వైసీపీ నేతలు తమ ప్రాభవాన్ని చూపాలని అనుకుంటున్నారు. రౌడీయిజంతో రెచ్చిపోయే మూకలను పోలీసులు కట్టడి చేస్తేనే ఎన్నికలు ప్రశాంతంగా సాగుతాయి. భయభ్రాంతాలకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఉండాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఏం చేస్తారో..

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వైసీపీ నేతల సిఫార్సులతో వచ్చిన కొందరు పోలీస్ అధికారులు తిష్ట వేశారు. ఎస్ఐ నుంచి డీఎస్పీ వరకు వారిలో ఉన్నారు. ఇక అంతకు కింది స్థాయి సిబ్బంది సరేసరి. పోలింగ్ రోజున వీరు ఎలా వ్యవహరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. పోలీసు ఉన్నతాధికారులపై ఎన్నికల కమిషన్ వేటు వేసిన నేపథ్యంలో కొందరిలో మార్పు కనిపిస్తోంది. కానీ వైసీపీ నేతల తాయిలాల ప్రభావం గురించి అనుమానాలు ఉన్నాయి

నువ్వా.. నేనా..!

పార్లమెంట్





అసెంబ్లీ ఎన్నికలంటే.. ఆ కిక్కే వేరు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు అధికారం ఉంటుంది. ఎమ్మెల్యే అయితేఏ.. నియోజకవర్గంలో ఐదేళ్లపాటు అంతా తామే..! అందుకే.. ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలని అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతారు. మునుపెన్నడూ లేని విధంగా.. ఈసారి ఎంపీ టిక్కెట్టే వద్దు.. ఎమ్మెల్యేనే ముద్దు అని పోటీ పడ్డారు. అలిగారు.. అధినాయకత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఒకరైతే.. ఏకంగా ఎమ్మెల్యే టిక్కెట్ కోసం జిల్లా దాటి మరీ వచ్చారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రధాన పోటీ టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే సాగుతోంది. కాంగ్రెస్, వామపక్ష అభ్యర్థులు చీల్చే ఓట్లు ఈసారి కొన్ని నియోజకవర్గాలలో గెలుపోటములను నిర్ణయించేలా ఉన్నాయి. సుమారు పన్నెండు గంటలపాటు ఓటర్లు ఇచ్చే తీర్పు.. వీరి ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. **- అనంతపురం సెంట్రల్**

టీడీపీ.. వైసీపీ.. కాంగ్రెస్/సీపీఐ అభ్యర్థులు

రాయదుర్గం
కాలవ శ్రీనివాసులు
మెట్టు గోవింద రెడ్డి
ఎంబీ చిన్న అప్పయ్య

ఉరవకొండ
పయ్యావుల కేశవ్
ఎల్లారెడ్డిగారి విశ్వేశ్వర రెడ్డి
వై. మధుసూదన్ రెడ్డి

గుంతకల్లు
గుమ్మనూరు జయరాం
వై.వెంకట్రామి రెడ్డి
కావలి ప్రభాకర్

తాడిపత్రి
జేసీ అస్మిత్‌రెడ్డి
కేతిరెడ్డి పెద్దారెడ్డి
గుజ్జల నాగిరెడ్డి



శింగనమల (ఎస్సీ)
బండారు శ్రావణిశ్రీ
మన్నెపాకుల వీరాంజనేయులు
సాకే శైలజానాథ్

అనంతపురం అర్బన్
దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్
అనంత వెంకట్రామిరెడ్డి
సి.జాఫర్ (సీపీఐ)

కళ్యాణదుర్గం
అమిలినేని సురేంద్రబాబు
తలారి రంగయ్య
పి.రామ్‌భూపాల్ రెడ్డి

రాప్తాడు
పరిటాల సునీత
తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి
ఎ. ఆంధ్రా శంకరయ్య



వారి ఓట్లు అలాగే ఉంచేశారు..!



ఎన్నికల నిబంధనల ప్రకారం 18ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి. అయితే అనంతపురంరూరల్ మండలంలోని అధికారులు ఇవే పట్టించుకోకుండా 16ఏళ్లవారికి సైతం ఓటు హక్కు కల్పించారు. మండలంలోని క్రిష్ణంరెడ్డిపల్లిలో ఆధార్‌లో పుట్టిన సంవత్సరాన్ని మార్చి ఓటర్లుగా నమోదు చేశారు. వారి వివరాలను ఆధారాలతో 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ఈక్రమంలో అధికారులు వాటి తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అయితే ఇటీవల విడుదలైన కొత్త ఓటరు జాబితాలో వయస్సు తక్కువ వారి ఓట్లను అలానే ఉంచారు. దీనిబట్టి చూస్తే విధుల పట్ల ఆ అధికారులు ఎంత అంకితభావంతో పనిచేస్తున్నారో అర్థం అవుతోంది. - అనంతపురంరూరల్

ప్రలోభాలకు లొంగకండి

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 12 : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఓటు వేస్తున్న ఓటర్లకు, ఎన్నికలు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆయన ఆల్‌ద బెస్ట్ చెప్పారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంత పోలింగ్‌కు అందరూ సహకరించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులు సైతం ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు చేపట్టామని, 144 సెక్షన్ అమలలో ఉందని పోలింగ్‌కు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటరు కార్డు లేకపోయినా కమిషన్ నిర్దేశించిన 12 రకాల గుర్తింపుకార్డులు చూపించి జాబితాలో పేరు ఉన్నవారు ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లో పోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేశామని, ఇక్కడి నుంచే అన్ని పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో 20,18,162 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో 10,20,124 మంది మహిళలు, 9,97,792 మంది పురుషులు, 246 మంది థర్డ్ జెండర్ ఉన్నారని పేర్కొన్నారు. వందేళ్ల పైబడిన ఓటర్లు 31 మంది ఉండగా, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 25,211 మంది ఉన్నారన్నారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువ ఓటర్లు జిల్లాలో 49,234 మంది ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

బంధువులైతేనే రూ. 2 వేలు..!



చికెన్, పలావ్ అందరికీ

ఎన్నికల వేళ వైసీపీ డబ్బుల పంపిణీలో చిత్ర విచిత్ర సన్నివేశాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కో ఓటుకు రూ.2వేలు చొప్పున పంచేందుకు అభ్యర్థులు.. వారి నాయకులకు అందజేస్తున్నారు. అయితే ఓటరుకు పంచేటప్పుడు మాత్రం నాయకులు వారి బంధువులైతేనే రూ.2వేలు ఇస్తున్నారు. ఇతరులకైతే రూ.1000 పంచి మిగిలిన మొత్తాన్ని జేబులోకి తోస్తున్నారు. అదేవిధంగా చికెన్, పలావ్, బిర్యాని మాత్రం అందరికీ పిలిచిపిలిచి మరీ పెడుతున్నారు. ఓటర్లు ఈ సన్నివేశాలను తలుచుకుంటూ వైసీపీ నాటకాలకు ఓటుతోనే బుద్ధిచెబుతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - అనంతపురం సెంట్రల్



ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా..?

వెంటాడుతున్న పోలీసు సిబ్బంది కొరత

కవాతులతో సరిపెడుతున్న పోలీసు అధికారులు

ఎన్నికల వేళ ప్రజల్లో భయాందోళనలు



తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్

తాడిపత్రిటౌన్, మే 12: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటైన తాడిపత్రిలో ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతపై సందేహాలు నెలకొన్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఈ ప్రాంతంలో దాడులు, ప్రతిదాడులు, హత్యలు జరుగుతుండడం పరిపాటిగా మారింది. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు కేవలం కవాతులతో సరిపెడుతున్నారు. పోలీసుల తీరు చూస్తుంటే ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. తాడిపత్రి పేరు వింటేనే ఫ్యాక్షన్, దాడులు, హింసాత్మక సంఘటనలు గుర్తుకు వస్తాయి. సాధారణ రోజుల్లోనే నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట తరచూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. నియోజకవర్గంలో తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు ఉన్నాయి. అసెంబ్లీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు ఏవి జరిగినా ఇక్కడ పనిచేసే పోలీసు అధికారుల్లో టెన్షన్ నెలకొని ఉంటుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన జేసీ ఫ్యామిలీ, అదేస్థాయిలో రాజకీయ అనుభవం కలిగిన కేతిరెడ్డి ఫ్యామిలీలు ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరపున పోటీలో ఉండడమే ప్రధాన కారణం. రెండు కుటుంబాలు డీ అంటే డీ అంటుండడంతోనే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల పరంపర

తాడిపత్రి అసెంబ్లీ స్థానానికి పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలోగానీ, రోడ్‌షోల్లో గానీ, నాయకులు, కార్యకర్తల కోలాహలంలో గానీ ఒకరికి మించి మరొకరు పోటీ పడుతుంటారు. గత ఎన్నికలను ఒకసారి పరిశీలిస్తే, 2004 ఎన్నికల్లో టీడీపీ తరపున కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జేసీ దివాకర్‌రెడ్డి పోటీ పడ్డారు. ఇద్దరూ ఒకేరోజు నామినేషన్ వేయడంతో ఇరువర్గాలు పెద్దఎత్తున రాళ్లు రువ్వుకున్నాయి. దీంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున జేసీ దివాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి పేరం నాగిరెడ్డి పోటీపడ్డారు. ఇరువర్గాలు రాళ్లవర్షం కురిపించడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పట్లో టీడీపీ అభ్యర్థి పేరం నాగిరెడ్డి కాలర్‌ను సీఐ పట్టుకోవడం సంచలనం రేపింది. 2014ఎన్నికల్లో టీడీపీ నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ తరపున వీఆర్ రామిరెడ్డి పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కూడా ఘర్షణలు, దాడులు చోటుచేసుకున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున జేసీ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డి, వైసీపీ నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి తలపడ్డారు. ఈ ఎన్నికల్లో పట్టణంలోని గర్ల్స్‌హైస్కూల్ సమీపంలో టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిపై వైసీపీ అల్లరి మూకలు దాడులకు ప్రయత్నించడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండలంలోని వీరాపురం గ్రామంలో ఓటింగ్ నిర్వహణ సరిగా లేదని చెప్పిన టీడీపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డిని వైసీపీ వర్గీయులు హత్య చేయడంతో అప్పట్లో రాష్ట్రం ఉలిక్కిపడేలా చేసింది. యాడికి మండలం వెంగన్నపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు బాహాబాహీకి దిగి పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి టీడీపీ వర్గీయులు 20 మంది, వైసీపీ వర్గీయులు 20 మందిపై కేసులు నమోదు చేశారు. చింతలాయపల్లిలో వృద్ధ ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్లే విషయమై టీడీపీ, వైసీపీ వర్గాలు గొడవపడి రాళ్ల దాడిచేసుకున్నాయి. యల్లనూరు మండలం జంగంపల్లి, చింతకాయమంద గ్రామాల్లో ఏజెంట్ల విషయంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఎన్నికలు ఎలా జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సిబ్బంది కొరత

రాష్ట్రంలోనే సమస్యాత్మక ప్రాంతమైన తాడిపత్రిలో తగినంతమంది పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాడిపత్రిపట్టణ జనాభా దాదాపు లక్షకు పైగా ఉంది. కానీ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య చాలా తక్కువ ఉంది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిబంధనల మేరకు సీఐతో పాటు నలుగురు ఎస్‌ఐలు, 46 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఒక సీఐతోపాటు ఎస్‌ఐ, 10మంది కానిస్టేబుళ్ల విధులు నిర్వహించడం బట్టిచూస్తే ఈ ప్రాంతంపై పోలీసు ఉన్నతాధికారులు ఎంత శ్రద్ధపెడుతున్నారో అర్థమవుతుంది. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నియోజకవర్గంలోని యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతారా..?

నియోజకవర్గంలో అసాంఘిక, అరాచక శక్తులపై పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపుతారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొరవడిన సిబ్బందితో మట్కా, పేకాట వంటి కార్యకలాపాలనే పోలీసులు కట్టడి చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కక్షలు, కార్పణ్యాల మధ్య జరిగే ఈ ఎన్నికలను ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ ప్రాంతంలో పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని అమలుచేయాల్సి ఉండగా ఇప్పటికి అలాంటి కార్యాచరణ మొదలుపెట్టకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసు అధికారులు అప్రమత్తం కాకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మరోసారి ఘర్షణలకు తాడిపత్రి కేంద్రబిందువుగా మారనుందనడంలో సందేహం లేదు.



ఎస్సీ, ఎస్టీలకు దొంగదెబ్బ..!

ఆయా కాలనీల్లో ఉన్నవారికే ఉచిత విద్యుత్

ఉమ్మడి జిల్లాలో 14వేల కనెక్షన్లకు సబ్సిడీ తొలగింపు

జగన్ పాలనపై బాధితుల ఆగ్రహం



విద్యుత్ శాఖ కార్యాలయం

అనంతపురం రూరల్, మే 12: నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ ఆయా వర్గాలను బ్రహ్మాండంగా ఉద్ధరించినట్లు నిత్యం సభలు, సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఊదరగొట్టడం చూస్తుంటం. అయితే ఆ వర్గాలకే సడీ చప్పుడు కాకుండా జగన్ దొంగ దెబ్బ వేశాడు. చిన్న మెలిక పెట్టి వారికి ఉచిత విద్యుత్ లేకుండా చేశాడు. టీడీపీ హయంలో ఎస్సీ, ఎస్టీకు ఉచిత విద్యుత్ అందింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక..నమ్మి ఓట్లేసిన వారినే దెబ్బతీశాడు. దళిత వాడల్లో ఉన్న వారికే ఉచిత విద్యుత్ అంటూ నిబంధన పెట్టి సబ్సిడీ విద్యుత్‌ను తొలగించేశాడు. ఇలా ఉమ్మడి జిల్లాలో 14వేల కనెక్షన్లకు సబ్సిడీ విద్యుత్‌ను విద్యుత్ అధికారులు నిలిపివేశారు. దీంతో ఆయా వర్గాల సభ్యులు ప్రభు త్వంపై మండిపడుతున్నారు. ఎక్కడైనా ఉన్న సబ్సిడీని మరింత పెంచే విధంగా నిర్ణయాలు ఉండాలిగాని..తొలగించడమేంటంటూ ఆయా వర్గాల సభ్యులు వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలంటే కేవలం ఆయా కాలనీల్లో మాత్రమే ఉండాలా? మరో చోట ఉండకూడదా? ఇదెక్కడి న్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ కేవలం మాటలకేనంటూ పెదవిరుస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.65లక్షల కనెక్షన్లు..

ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1.65లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1.28లక్షలు ఎస్సీలకు కనెక్షన్లు ఉండగా, మరో 36వేల కనెక్షన్లు ఎస్టీలకు సంబంధించినవి. వీటిలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లేని వారికి సంబంధించిన 14వేల సర్వీసులను గుర్తించారు. వారందరికీ ఉచిత విద్యుత్‌ను తొలగించేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందు లో అనంతపురంలో 5వేల కనెక్షన్లు, కదిరి ప్రాంతంలో పదిహేనువందల కనెక్షన్లు, పెనుకొండ ప్రాంతంలో ఆరువందలు, మడకశిర ప్రాంతంలో 200 కనెక్షన్లు ఇలా ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లేనివారికి రాయితీ విద్యుత్‌ను నిలిపివేశారు. ఇదేనా జగన్ ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీల పట్ల ఉన్న చిత్తశుద్ధి అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేనేతకు జీఎస్టీ గుదిబండ

వైసీపీ పాలనలో తగ్గిన పట్టుచీరల వ్యాపారం

జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

అనంతపురం సెంట్రల్, మే 12: పట్టు వస్త్రాలకు గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(జీఎస్టీ) గుదిబండలా మారింది. వ్యాపారంలో ప్రతి రూ.100కు రూ.5 చొప్పున జీఎస్టీని చెల్లిస్తున్నారు. సంవత్సరానికి పెద్ద మొత్తంలో జీఎస్టీ కడుతున్నామని వైసీపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వ్యాపారులు మండిపడుతున్నారు. చేనేత వస్త్రాలంటేనే ఖరీదుతో కూడుకున్నవి. తక్కువ లాభంతోనే వ్యాపారాలు చేస్తున్న తమకు జీఎస్టీ గుదిబండలా మారిందని వాపోతున్నారు. తయారీ దారుల నుంచి కొనుగోలుచేసి రవాణా చేయడానికి తడిసిమోపెడు అవుతుంటే అదనంగా జీఎస్టీ కట్టాల్సి వస్తోందని మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎంత మొత్తం సరుకు కొన్నా.. అమ్మంకాని వాటిని తయారీదారులు వెనక్కి తీసుకునేవారు. వైసీపీ ప్రభుత్వంలో జీఎస్టీ అమలుకావడంతో తయారీదారులు వెనక్కి తీసుకోవడంలేదు. అదేవిధంగా ధరలు పెంచారు. దీంతో అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాని వ్యాపారులు అవేదన చెందుతున్నారు.

జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు హామీ

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే పట్టువస్త్రాల వ్యాపారులకు జీఎస్టీ సొమ్మును రీయింబర్స్‌మెంట్ రూపంలో వెనక్కి చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. విద్యార్థులకు కళాశాలల ఫీజులు, ఆసుపత్రులకు కట్టే వైద్య ఖర్చులకు చెల్లించే రీయింబర్స్‌మెంట్ లాగా చేనేత వస్త్రాల వ్యాపారులకు జీఎస్టీ మొత్తాన్ని తిరిగి ఇచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రీయింబర్స్‌మెంట్ హామీ వరం



సరుకు కొనుగోలు మొత్తంలో ఐదు శాతం జీఎస్టీని కడుతున్నాం. ఈ మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ చేస్తామని చంద్రబాబునాయుడు హామీనివ్వడం మాలాంటి వ్యాపారులకు వరం. ఇప్పటికే రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. వాటికి అదనంగా జీఎస్టీ చేరడంతో భారంపెరిగింది. దీంతో వ్యాపారాలు తగ్గిపోయి నష్టాల్లో చిక్కుకునాం. రూ.5లక్షల సరుకులో దాదాపు రూ.2లక్షల వరకు వెనక్కి తీసుకునేవారు. జీఎస్టీ కారణంగా తయాదారులు వెనక్కి తీసుకోవడంలేదు.

- అమర్నాథ్, పట్టువస్త్రాల వ్యాపారి, రాచానపల్లి, అనంతపురం మండలం

పోలింగ్ సిబ్బందితో ఆడుకున్న ఆర్వో

అనంత అర్బన్‌లో రాత్రిపూట వెళ్లిపోవాలని హుకుం

నీళ్లు, భోజనం లేక మహిళా సిబ్బంది ఆవేదన

ఓపీఓలకు రూ.500 ఇచ్చి పత్తాలేని అధికారులు



అధికారులు వెళ్లిపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే కూర్చున్న పోలింగ్ సిబ్బంది

అనంతపురం అర్బన్, టౌన్ 12 : పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ పదేపదే చెబుతున్నా జిల్లా కేంద్రంలో ఉండే అనంతపురం అర్బన్ ఎన్నికల అధికారులు పోలింగ్ సిబ్బందితో ఆడుకుని నానా ఇబ్బందులకు గురిచేశారు. కనీసం నీళ్లు, భోజనం లేక అవస్థలు పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులను పీఓ, ఏపీఓలు, ఓపీఓలుగా నియమించారు. వారందరికీ రెండుసార్లు శిక్షణ ఇచ్చి ఆదివారం ఎన్నికల డ్యూటీకి రమ్మన్నారు. ఉదయమే ఇక్కడికి చేరుకొని డ్యూటీకి జాయిన్ అయ్యారు. రిజర్వ్‌లో ఉన్నారని, వారికి ఎక్కడ అవసరమైతే అక్కడికి పంపుతామని అందరూ ఉండాలని స్టేజీ మీద ఉన్న ఆర్వో గ్రంధి వెంకటేష్, అసిస్టెంట్ ఆర్వో శివరామిరెడ్డి, ఇతర అధికారులు మైకులో చెబుతూ వచ్చారు. దీంతో దాదాపు వందమందికి పైగా అక్కడే ఉన్నారు. అధికారులు రాత్రి 8 గంటల సమయంలో మీరు అవసరంలేదు..ఇళ్లకు వెళ్లండని చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఉన్న గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ సిబ్బంది ఈ సమయంలో ఎలా పోవాలని ప్రశ్నించారు. అందుకు ఓపీఓలకు ఒక్కొక్కరికి రూ. 500 ఇచ్చి వెళ్లి పోండని, పీఓ, ఏపీఓలు ఉండాలని చెప్పి అక్కడున్న ఉన్న అధికారులు మాయమైపోయారు. రాత్రి 9 గంటలైనా నీళ్లు లేవు, భోజనం లేదు, అధికారులు అక్కడికి రాలేదు. దీంతో బిక్కుమొహం వేసుకొని అక్కడే ఉండడం కనిపించింది. కొందరు వెళ్లి పోగా.. మహిళా సిబ్బంది పరిస్థితి ఉండాలా.. ఉంటే ఎక్కడ ఉండాలి అని ఆందోళనగా కనిపించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రిజర్వ్‌లో ఉన్న సిబ్బందికి రాత్రి పూట పడుకోవడానికి వసతులు, భోజన ఏర్పాట్లు చేయాలి. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కనీసం వాళ్లకు నీళ్లు, అన్నం కూడా పెట్టలేదు. మరోవైపు మహిళా సిబ్బంది రాత్రిపూట ఎక్కడికి వెళతారని కనీసం ఆలోచించకుండా ఇలా ఆడుకోవడం ఏమిటన్న ఆరోపణలు వినిపించాయి.

అమ్మను చూడందే ఉండలేను

మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, మే 12: రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత పెద్ద కుటుంబంలో ఉన్నా, మా అమ్మ త్యాగాన్ని మరువలేనని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని వెంకటాపురంలోని తన నివాసంలో ఆమె తల్లి సరస్వతమ్మ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. సోమవారం పోలింగ్ ఉన్నప్పటికీ ప్రత్యేకంగా తన తల్లితో కాసేపు గడిపారు. పరిటాల సునీత సోదరి లక్ష్మితో కలిసి తల్లి సరస్వతమ్మ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ ఎన్నికలలో విజయం సాధించాలని సునీతను తల్లి ఆశీర్వదించారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ...ఆ రోజు గృహిణిగా ఉన్నా, మంత్రి అయినా, ఇప్పుడు రాజకీయాల్లో బిజీగా ఉన్నా నేను ఎప్పుడు మా అమ్మను చూడందే ఉండలేను అన్నారు. బాధ్యతలు ఎలా సమర్థవంతంగా నిర్వర్తించాలో అమ్మ నుంచే నేర్చుకున్నానన్నారు. ఆమె లేనిదే తాను లేను అని ఉద్వేగభరితంగా తెలిపారు.



తల్లితో మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటున్న పరిటాల సునీత, సోదరి లక్ష్మి

ఎన్నికలకు ఎమ్మెల్యే బస్సా..?

టీడీపీ నాయకుల అభ్యంతరం



ఎన్నికల సామగ్రిని తరలించడానికి వచ్చిన ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల బస్సు

బుక్కరాయసముద్రం, మే12: ఎన్నికల సామగ్రిని తరలించడానికి సిట్టింగ్ ఎమ్మెల్యే బస్సు వాడకున్న సంఘటన ఆదివారం శింగనమల నియోజకవర్గంలో జరిగింది. సోమవారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల కోసం నియమించిన సిబ్బంది, సామగ్రిని తరలించడానికి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి చెందిన ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల బస్సులను ఉపయోగించారు. మండలంలోని వెంకటాపురం గ్రామం పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఎస్‌ఆర్‌ఐటీ బస్సును ఆదివారం రాత్రి వెనక్కి పోవాలని పలువురు టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ విషయం పై నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణీశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుల నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నలశీనుకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలకు చెందిన బస్సులను వెనక్కి పంపించారు. ఆ స్థానంలో మరో బస్సును ఏర్పాటు చేశారు.

ప్రలోభాల పర్వం

మహిళా ఓటర్లకు చీరల పంపిణీ



యాడికి, మే12: ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు ఆదివారం చివరిరోజు కావడంతో వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు వైసీపీ నాయకులు చీరల పంపిణీ చేపట్టారు. రాయలచెరువులో వైసీపీ నాయకులు చీరలు పంపిణీ చేస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. చందనలో వైసీపీ నాయకులు చీరల పంపిణీకి తెరలేపారు.

గుడిపాడులో ఘర్షణ


మండలంలోని గుడిపాడులో ఆదివారం తెల్లవారుజామున ఒక వర్గం వారు మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేస్తుండటంతో మరొకవర్గం వారు అడ్డుకోబోయారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో గజేంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. దీనిపై సీఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా బాధితులు ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.

నగరూరులో వైసీపీ ప్రచారం

నగరూరు గ్రామంలో ఆదివారం వైసీపీ నాయకులు మోడల్ ఈవీఎంతో ప్రచారానికి దిగారు. సమాచారం అందుకున్న టీడీపీ వర్గీయులు అడ్డుకోబోయారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు తిరిగి వెనక్కి వెళ్లడంతో టీడీపీ వర్గీయులు శాంతించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

కూపన్‌లు ఇచ్చారు సరే.. డబ్బులు ఏవీ..?

మంత్రి ఉష శ్రీచరణ్ ఇంటి వద్ద ముస్లిం కుటుంబాల నిరీక్షణ



కూపన్‌లను చూపుతున్న దర్గా ప్రాంతవాసులు

పెనుకొండ టౌన్, మే 12: మంత్రి ఉషశ్రీ చరణ్ ఫొటోతో ఉన్న కూపన్‌లు ఇచ్చారు సరే మరి డబ్బులేవీ అని పలువురు ముస్లింలు మండి పడ్డారు. ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశ్యంతో మంత్రి ఫొటోతో ఉన్న కూపన్‌లను ఇంటింటికి పంపిణీ చేశారు. కూపన్ ఉన్న ప్రతి ఒక్కరికి రూ. 1500 చొప్పున ఇస్తామని నమ్మబలికారు. అయితే డబ్బులు ఇవ్వకపోవ డంతో ఆదివారం కూపన్‌లతో మంత్రి ఇంటి వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. ఎంత సేపటికి ఎవరూ స్పందించకపోవడంతో వైసీపీ తీరుపై ఆగ్రహించారు. అయితే అక్కడే ఉన్న వైసీపీ నాయకులు మంత్రి ఇంటి లైట్లు ఆపివేశారు. దీంతో వారు బండబూతులు తిట్టుకుంటూ వెనుతిరిగి వెళ్లారు. పెనుకొండ దర్గా వెనుక భాగంలో ఉన్న ముస్లిం కుటుంబాలకు నాలుగు రోజుల కిందట వలంటీర్ల ద్వారా కూపన్‌లు అందించి, తొందర్లో డబ్బులు ఇస్తామని చెప్పారు. సోమవారం ఓటింగ్ కూడా జరుగనుంది. అయినా ఇంత వరకు తమ ప్రాంతానికి ఎవరూ రాకపోవడంతో తామే ఇక్కడకి వచ్చినట్లు వారు తెలిపారు. కూపన్‌లు ఇవ్వడమెందుకు, మోసం చేయడమెందుకు అంటూ మండిపడ్డారు. సోమందేపల్లి, పెనుకొండ మండలాల్లో కూపన్‌లు అందించిన వారికి డబ్బు ఇవ్వలేక సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారట. దీంతో ఆగ్రహించిన ఓటర్లు ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని ఆగ్రహించారు.

ఓటరు కోసం సెల్ఫీ స్పాట్



అనంతపురం కోర్టు రోడ్డు నెహ్రూ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్

అనంతపురం విద్య, మే 12: తాము ఓటేశామని చూపుడు వేలికి ఉన్న సిరా గుర్తును చూపడం కొందరికి సరదా. తొలిసారి ఓటు వేసిన యువత అయితే ఫొటోలు దిగి, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తుంటారు. అందుకే ఎన్నికల అధికారులు కూడా ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లు సెల్ఫీ తీసుకోవడానికి ఓ స్పాట్‌ను ఏర్పాటు చేశారు. నగరంలోని కోర్టు రోడ్డు నెహ్రూ మున్సిపల్ అప్పర్‌ప్రైమరీ స్కూల్ పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల కోసం జిల్లా ఎన్నిల అధికారులు సెల్ఫీ స్పాట్ పెట్టారు. ఓటు వేసి వచ్చిన ఓటర్లు సెల్ఫీ తీసుకునేందుకు వీలుగా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. దీన్ని నగరంలోని పోలింగ్ కేంద్రాలకు మోడల్ పోలింగ్ కేంద్రంగా అధికారులు చెబుతున్నారు. మరెందుకు ఆలస్యం ఈ కేంద్రంలో ఓటు ఉన్న వారు ఓటు వేసి సెల్ఫీ దిగి స్మార్ట్‌గా పోస్ట్ పెట్టేయండి.

31 మంది ఓటర్లకు వందనం



అనంతపురం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో వందేళ్లు పైబడి ఉన్న ఓటర్లు 31మంది ఉన్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వీరంతా సోమవారం జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇద్దరు, ఉరవకొండలో 9 మంది, గుంతకల్లులో ఏడుగురు, తాడిపత్రిలో ఇద్దరు, శింగనమలలో ఒకరు, అనంతపురం అర్బన్‌లో ఒకరు, కళ్యాణదుర్గంలో ఒకరు, రాప్తాడు నియోజకవర్గంలో ఎనిమిది మంది వందేళ్ల పైబడిన ఓటర్లు ఉన్నారు.

- అనంతపురం టౌన్

రాప్తాడులో కొరవడిన సమన్వయం..!

రాప్తాడు నియోజకవర్గంలో ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. సాధారణ ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభం కానున్నాయి. అయితే ఇంత వరకు సంబంధిత అధికారుల నుంచి పోలింగ్ కేంద్రాల వివరాలు, ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపు వంటివీ ఏమాత్రం తెలియజేయని పరిస్థితి. రాప్తాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద మీడియా పాయింట్ ఉన్నా..అక్కడి నుంచి సంబంధిత మీడియా బృందానికి ఎలాంటి సమాచారం ఉండటం లేదు. మీడియా బృందం సభ్యులు ఏదైనా సమాచారం కోసం ఫోన్ ద్వారా సంప్రదించినా సరైన సమాచారం ఉండటం లేదు. ఒక్కో సందర్భంలో ఫోన్ కూడా లిఫ్ట్ చేయని పరిస్థితి నెలకొంది. పక్క నియోజకవర్గాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు ఏఈఆర్‌ఓలు ఇతర సిబ్బందికి మీడియా సెల్ ద్వారా సమాచారం ఉంటోంది. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉండటంలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా యి. ఇంత గోప్యంగా ఎన్నికల నిర్వహణ చేయల్సిన అవసరం ఏముందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



- అనంతపురం రూరల్

తాడిపత్రి, రాప్తాడు, శింగనమలలో అత్యధిక సమస్యాత్మక కేంద్రాలు



అనంతపురం జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలలో సోమవారం పోలింగ్ జరగనుంది. ఇందులో 692 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు జిల్లా అధికార యంత్రాంగం గుర్తించింది. కలెక్టరు తెలిపిన మేరకు వీటిలో అత్యధికంగా తాడిపత్రి నియోజకవర్గంలో 136, రాప్తాడులో 134, శింగనమలలో 133, రాయదుర్గంలో 30, ఉరవకొండ లో 75, గుంతకల్లులో 35, అనంతపురం అర్బన్‌లో 85, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 34 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు కలెక్టరు వినోద్ కుమార్ వెల్లడించారు.

- అనంతపురం టౌన్

తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి గూండాగిరి..!



పీఆర్ కొట్టాలలో జరిగిన దాడిలో మహిళ చేతికి గాయం

ఏప్రిల్ 28న తోపుదుర్తి గ్రామంలో దాడిలో గాయపడిన దళిత వన్నూరప్ప

గురువారం తోపుదుర్తిలో రాజశేఖర్‌రెడ్డి అనుచరుల దాడిలో గాయపడిన రాజ్‌కుమార్



● ఈ నెల 7న కనగానపల్లి మండలం రాంపురం గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి భారీ జనం రావడంతో జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్తలు మద్యం మత్తులో మిద్దెల మీద నుంచి ప్రచార రథంపై రాళ్లు రువ్వారు. మీసాలు దువ్వుతూ, తొడలు కొడుతూ, దమ్ముంటే రండిరా అని ప్రత్యర్థులను రెచ్చగొట్టారు. పోలీసులు వైసీపీ కార్యకర్తలను అడ్డుకునేందుకు వెళ్లగా మద్యం మత్తులో వారు పోలీసులపై కూడా దాడి చేసేందుకు ప్రయత్నించారు.

● కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, వడ్డే మోహన్, వడ్డే శ్రీనివాసులు, వడ్డే లక్ష్మీనారాయణ, తదితరులు టీడీపీలోకి చేరేందుకు స్వగ్రామం నుంచి అనంతపురానికి వాహనంలో వెళుతుండగా తోపుదుర్తి గ్రామంలో రాజశేఖర్‌రెడ్డి అనుచరులు ఎంపీటీసీ పోతులయ్య, కుమార్‌రెడ్డి, మరి కొందరు గురువారం రాత్రి వాహనాన్ని ఆపారు. వాహనాన్ని ధ్వంసం చేశారు. రాజ్‌కుమార్, ఇతరులపై తీవ్రంగా దాడి చేశారు.

● ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలో కొందరు దళితులు, వాల్మీకులు టీడీపీలో చేరారు. అది జీర్ణించుకోలేని తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఏప్రిల్ 28న తన అనుచరులతో కలిసి అర్ధరాత్రి తోపుదుర్తి గ్రామంలో టీడీపీ దళిత నాయకుడు వన్నూరప్ప ఇంట్లోకి వెళ్లి తీవ్ర స్థాయిలో బెదిరించాడు. వైసీపీలో చేరాలని లేదంటే చంపేస్తామని హెచ్చరించాడు. వన్నూరప్ప నిరాకరించడంతో పిడిగుద్దులు గుద్దుతూ గ్రామంలోని ఎమ్మెల్యే ఇంటి వద్దకు తీసుకెళ్లారు. తర్వాత టీడీపీ నాయకుడు బోయ లింగమయ్య ఇంటి వద్దకు రాజశేఖర్‌రెడ్డి ఆవేశంగా వచ్చి ఉంటే వైసీపీలో ఉండాలి లేదంటే ఊరు విడిచి వెళ్లాలి. పార్టీలోకి చేరకపోతే నరికేస్తాం అని బెదిరించాడు.

టీడీపీలోకి చేరిన వారిపై దాడులు... పరిటాల సునీత ప్రచార రథంపైకి రాళ్లు... పోలీసులపైనా దాడికి యత్నం

రాప్తాడులో సవాల్‌గా మారనున్న ఎన్నికలు

రాప్తాడు

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి, అతడి అనుచరులు బరితెగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా టీడీపీ శ్రేణులపై వరుస దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరుతుండడం జీర్ణించుకోలేక దాడులు చేస్తున్నారు. కొడకల్లారా.. ఉంటే వైసీపీలో ఉండండి లేదా ఊరు విడిచి వెళ్లిపోండి.. నరుకుతాం, చంపుతాం.. అని బెదిరిస్తూ దాడులకు తెగబడుతున్నారు. దళిత, బీసీ నాయకులపై విచక్షణా రహితంగా దాడి చేసి అడ్డు వచ్చిన వారిని కూడా గాయపరుస్తున్నారు. ఎన్నికల సమయంలో వరుస దాడులు పోలీసులకు సవాల్‌గా మారాయి. సోమవారం జరిగే ఎన్నికల్లో వైసీపీ శ్రేణులు సమస్యాత్మక గ్రామాల్లో ఇదే స్థాయిలో దాడులకు పాల్పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

● శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పీఆర్ కొట్టాల గ్రామానికి చెందిన మాదాపురం ఎంపీటీసీ (దళితవ్యక్తి) సంపత్ వైసీపీని వీడి టీడీపీలో చేరాడు. అతడు పార్టీ మారడంతో పీఆర్ కొట్టాలలో అధికంగా ఉన్న దళిత ఓట్లు టీడీపీకి వెళతాయని ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర్‌రెడ్డి బరితెగించాడు. గత నెల 27న రాజశేఖర్‌రెడ్డి తన అనుచరుడైన నసనకోట ముత్యాలు తదితరులు 15 వాహనాల్లో పీఆర్ కొట్టాలకు వెళ్లి సంపత్, అతడి తల్లిదండ్రులపై కూడా దాడులు చేశారు. దాడిని అడ్డుకున్న దళిత మహిళ లక్ష్మక్కను వైసీపీ నాయకులు జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టారు. పోతన్నపై కట్టెలతో దాడి చేశారు. ఎంపీటీసీ సంపత్‌ను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లి వైసీపీ కండువా కప్పారు. వైసీపీలోనే కొనసాగుతానని సంపత్‌తో బలవంతంగా చెప్పించి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



ఈనెల 7న రాంపురంలో మీసం మెలేస్తున్న వైసీపీ శ్రేణులు

మాటతప్పిన తోపు..!


పాలబావికి రోడ్డేయలేదు
కంకర పరిచిన దారితో ప్రజల అవస్థలు
నేరవేరని తోపు ఎన్నికల హామీ

రాప్తాడు, మే 12: అధికారంలోకి వచ్చిన వెంటనే పాలబావి గ్రామానికి తారు రోడ్డు వేయిస్తానని ప్రకాష్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి మాట తప్పారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన తరువాత రోడ్డు గురించి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పట్టించుకోలేదని వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా కంకర పరచిన దారిలో ప్రయాణం చేస్తూ అవస్థలు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పరిటాల సునీత మరూరు నుంచి ఎం. చెర్లోపల్లి, పాలబావి మీదుగా మారెమ్మ ఆలయం వరకూ 9.2 కి.మీ తారు రోడ్డు నిర్మాణానికి రూ.4.9 కోట్లు నిధులు మంజూరు చేయించారు. భూమి పూజ చేసి పనులు కూడా ప్రారంభించా రు. కాంట్రాక్టర్ తారు రోడ్డు నిర్మాణానికి చిన్న కంకర తోలించారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అప్పటి ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రకాష్‌రెడ్డి పాలబావిలో పర్యటించి అధికారంలోకి రాగానే గ్రామానికి తారు రోడ్డు వేయిస్తానని బహిరంగ సభలో గ్రామస్థుల కు హామీ ఇచ్చాడు. ఎన్నికల్లో గెలిచి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యే సోదరులు కాంట్రాక్టర్‌ను డబ్బు డిమాండ్ చేయడంతో ఆయన పనులు నిలిపివేశారని సమాచారం. ఆ తరువాత ఎమ్మెల్యే తారు రోడ్డు నిర్మాణానికి పాత కాంట్రాక్టర్‌ను తొలగించి రీ టెండర్లు కూడా పిలవలేకపోయాడు. దీంతో మరూరు నుంచి చెర్లోపల్లి, పాలబావి మీదుగా మారెమ్మ అలయం వరకూ తారు రోడ్డు కలగానే మిగిలిపోయింది. పాలబావి గ్రామంలో దాదాపు 220 కుటుంబాలు 800కు పైగా జనాభా, 500పైగా ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉన్నా తారు రోడ్డు వేయించలేక పోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డెప్పుడేస్తారో: చెండ్రాయుడు, పాలబావి



మా గ్రామానికి తారురోడ్డు ఎప్పుడు వేస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రజలు వాహనదారులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్నికల తర్వాత వచ్చే కొత్త ప్రభుత్వమైనా దీన్ని పట్టించుకుని రోడ్డు పూర్తి చేయాలి.



ఎం. చెర్లోపల్లి నుంచి పాలబావికి కంకర పరిచిన దారి

హామీ ఇచ్చి వదిలేశారు: నరేష్, పాలబావి



గత ఎన్నికల ప్రచారంలో పాలబావికి రోడ్డేస్తామని ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. కంకర దారిలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయి.

తారు రోడ్డు నిర్మించాలి: రామాంజి, పాలబావి



మా గ్రామానికి తారురోడ్డు లేకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర పరచిన దారిలోనే నాలుగేళ్ల నుంచి ప్రయాణిస్తున్నాం. వెంటనే తారురోడ్డు నిర్మించాలి

గ్రామాల్లో బెట్టింగ్ జోరు



కళ్యాణదుర్గం, మే 12: సార్వత్రిక ఎన్నికలపై గ్రామాల్లో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఎన్డీయే కూటమి గెలుస్తుందని రూ. రెండు లక్షల నుంచి రూ. ఆరు లక్షల వరకు బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. దాంతో పాటు నియోజకవర్గంలో తమ పార్టీయే గెలుస్తుందని మరో వైపు బెట్టింగ్‌లు కడుతున్నారు. కళ్యాణదుర్గంలో టీడీపీ గెలుస్తుందనే బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. కళ్యాణదుర్గంటౌన్, రూరల్, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండల కేంద్రాల్లో బెట్టింగ్‌లు వేడిని పుట్టిస్తున్నా యి. ఇప్పటికే కొంతమంది బెట్టింగ్‌లు వేసుకుని జాయింట్ అకౌంట్‌ల ద్వారా బ్యాంకుల్లో డబ్బును భద్రపరచినట్లు తెలిసింది. గెలిచిన తరువాత ఆ డబ్బును పంచుకునే విధంగా ప్రణాళికలు వేసుకుని బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ సారి ఎక్కువగా యువత ఈ బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల నుంచి యువత డిన్నర్లు, మందు, విందులతో పల్లె ప్రాంతాలు బిజీ బిజీగా కనిపిస్తున్నాయి. సుదూర ప్రాంతా ల్లో ఉద్యోగాలు చేసుకునే యువత కూడా ఓటేయడానికి తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. కంబదూరు, కుందుర్పి మండల కేంద్రాల్లో అయితే యువత ఏకంగా ఇంటింటికి వెళ్లి టీడీపీకే ఓటు వేయాలని అర్ధరాత్రి వరకు ప్రచారాలు చేస్తున్నారు. కళ్యాణదుర్గం ఓటర్లు టీడీపీ వైపే మొగ్గు చూపుతున్నట్లు పలువురు యువకులు చెబుతున్నారు. ఈక్రమంలో కళ్యాణదుర్గం పట్టణంలో బెట్టింగ్‌ల జోరు మరింతగా పుంజుకుంటోంది. మరికొంతమంది ఓటింగ్ పూర్తయ్యాక, ఓటింగ్ సరళినిబట్టి బెట్టింగ్ వేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరి కొన్ని చోట్ల అగ్రిమెంట్లు రాసుకుని బెట్టింగ్‌లు కాస్తున్నారు.

ఇళ్లకు చేరని ఓటరు స్లిప్పులు

సచివాలయాల్లో మూలుగుతున్న 25 శాతం
అందుబాటులో లేని బీఎల్‌ఓలు

గుంతకల్లు

పట్టణంలో దాదాపు పాతిక శాతం ఓటరు స్లిప్పులు వార్డు సచివాలయాల్లో మూలుగుతున్నాయి. ఓటరు స్లిప్పులు సక్రమంగా ఓటరు ఇంటికి చేరకపోవడంతో బీఎల్వోలు రెండో శనివారం, ఆదివారాలలోనూ పంపిణీకి యత్నించారు. పట్టణంలో దాదాపు డెబ్బై ఐదు శాతం స్లిప్పులను మాత్రమే ఓటరుకు చేర్చగలిగారు. అడ్రసు ట్రేస్ కాలేదని, ఓటరు మరో వార్డులో నివసిస్తున్నాడని, ఫోన్ నెంబరు తప్పుగా ఉందన్న కారణాలతో ఓటరు స్లిప్పులను సచివాలయాలకు చేర్చారు. శని, ఆదివారాల్లో కూడా సచివాలయాలను తెరచి ఉంచి స్లిప్పుల కోసం వచ్చిన ఓటర్లకు వెతికి ఇచ్చారు. అలాగే కొన్ని సచివాలయాలు తెరవలేదు.

గుంతకల్లుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పట్టణంలోని పొట్టిశ్రీరాముల మున్సిపల్ పాఠశాలలోని 65 పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలైనా ఓటర్ల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఈ పోలింగ్ కేంద్రంలో దాదాపు 1059 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కేవలం ఒక మహిళతో పోలింగ్ కేంద్రంలో పని చేయించారు. ఓటర్ల కోసం షామియానా, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. పట్టణంలోని మరికొన్ని పోలింగ్ కేంద్రాలలో ఆలస్యంగా ఏర్పాట్లను చేశారు.

పామిడి: పట్టణంలోని చాలా మంది ఓటర్లకు ఓటు స్లిప్పులు అందజేయడంలో అధికారులు విఫలమయ్యారు. సోమవారం ఓటు వేయాలంటే తమ ఓటు ఏ కేంద్రంలో ఉందో తెలియక చాలా మంది ఓటర్లు పంచాయతీ కార్యాలయం, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అధికారులు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయలేని స్థితిలో ఉన్నారా..? అని అసహనం వ్యక్తంచేస్తున్నారు.

గుత్తి: ఓటర్లకు గుత్తిపట్టణంలో ఆదివారం వరకూ కూడా కొందరికి స్లిప్పులను పంపిణీచేయలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు స్లిప్పుల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక ఆపసోపాలు పడ్డారు. ఓటరు స్లిప్‌లు అందలేదు.

మడకశిర రూరల్: ఓటరు స్లిప్పుల కోసం పలువురు ఓటర్లు బీఎల్‌ఓల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే చాలా మంది బీఎల్‌ఓలు అందు బాటులో లేకపోవడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్లిప్పులో ఓటరుకు తన ఓటు ఎక్కడ ఉంది, ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు, పోలింగ్ బూత్ నెంబరు తదితర వివరాలు ఉంటాయి. ఈ స్లిప్పులు అందిస్తే ఓటరుకు గందరగోళం లేకుండా సులభంగా తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. ఓటర్ స్లిప్పులను బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్ల దగ్గరికి ముందస్తుగానే వెళ్లి అందజేయాల్సి ఉంది.

స్లిప్‌ల కోసం పడిగాపులు



నేను 9వ వార్డులో నివాసముంటున్నా. సోమవారం ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఇంతవరకూ ఎవరూ స్లిప్‌లు ఇవ్వలేదు. ఓటర్ స్లిప్‌ల కోసం ఎవరిని అడిగినా పట్టించుకోలేదు. సచివాలయం వద్దకు వెళ్లినా అక్కడ ఎవరూ ఉండటంలేదు.

- భాగ్యమ్మ, 9వ వార్డు, గుత్తి

ఓటు వేయడానికి బెంగళూరు నుంచి వచ్చా



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా. ఓటు హక్కు వినియోగించుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చా. నాది, నా భార్య ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియని పరిస్థితి. ఓటరు స్లిప్పు కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్తే, గ్రామ సచివాలయం వద్దకు వెళ్లమన్నారు. అక్కడ తాళం వేసి ఉంది. అక్కడ అడిగితే పోలింగ్ స్టేషన్ వద్దకు వెళ్లమన్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద ఎవరూ లేరు. ఓటర్లకు స్లిప్పులు సక్రమంగా పంచలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

- అశోక్ కుమార్, సాఫ్టవేర్ ఇంజనీర్, పామిడి





గుంతకల్లులోని తిలక్‌నగర్ సచివాలయంలో మిగిలి ఉన్న ఓటరు స్లిప్పులు

స్లిప్పులు ఇవ్వలేదు..



ఓటు వేయడానికి వెళ్లేందుకు బీఎల్‌ఓ మాకు ఓటరు స్లిప్‌లు ఇవ్వలేదు. ఎక్కడ ఓటు వేయాలో తెలియదు. ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు రాలేదు. చివరి రోజు వరకూ స్లిప్‌లు లేకపోతే ఎలా?

- అంజనేయులు, ఓటరు, గుత్తి

ఓటరు స్లిప్‌లు ఇచ్చేవారే లేరు



ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్‌లు ఇచ్చే వారే దిక్కు లేదు. ఎవరిని అడిగినా అక్కడికిపో ఇక్కడికిపో అని చెబుతున్నారు తప్ప, ఎక్కడికి వెళ్లినా ఓటర్ స్లిప్ ఇచ్చే నాథుడే లేదు. ఓటరు స్లిప్పులు లేక ఇబ్బందులు పడుతున్నాము. గుత్తి ఆర్‌ఎస్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్దకు వస్తే స్లిప్పులు ఇస్తానని బీఎల్‌ఓ తెలిపాడు. ఆయన ఎప్పుడిస్తాడో తెలియదు.

- ఖలీల్, 6వ వార్డు, గుత్తి

సంక్షోభంలో సంక్షేమం


శింగనమల ఎస్సీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్ల దుస్థితి

- సంక్షేమ వసతిగృహాల నిర్వహణ గాలికి..
- విద్యార్థుల జీవితాలతో వైసీపీ చెలగాటం
- హాస్టల్ భవనాలకూ మరమ్మతులు చేయని వైనం
- మెయింటెనెన్స్‌కు చిల్లిగవ్వ కూడా విదల్చని ప్రభుత్వం
- సకాలంలో డైట్ బిల్లులూ విడుదల చేయలేని దుస్థితి
- విద్యార్థుల వైద్య పరీక్షలకు మంగళం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 12: వైసీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ వసతిగృహాలు సర్వ నాశనం అయ్యాయి. ఒక్క హాస్టల్‌ను కూడా అభివృద్ధి చేయకపోగా... శిథిలావస్థకు చేరుకున్న వాటికి కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన వసతి, భోజనం, విద్యను అందిస్తామని... పిల్లలను వసతిగృహాల్లో చేర్పించాలని సీఎం జగన్ పదే పదే చెబుతూ వచ్చారు. అయితే చేతలు మాత్రం శూన్యం. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి ఆ మాటలు ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో పదుల సంఖ్యలో సంక్షేమ వసతిగృహాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్నింటిని ఏకంగా మూసేశారు. నాడు-నేడు అంటూ ఆశలు రేపారు. ఇప్పటికీ ఆ నాడు-నేడు ఏమైందో ఎవరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. మరోవైపు మూడు నెలలకోసారి... ఆరు నెలలకోసారి వసతిగృహాలకు విడుదల చేయాల్సిన నిర్వహణ నిధులనూ ప్రభుత్వం విడుదల చేయలేదు. కనీస మౌలిక వసతులనూ కల్పించలేదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేదు. ఐదేళ్లలో కేవలం ఒక్కసారి అదికూడా రూ. 150 నుంచి రూ. 200 డైట్ చార్జీలు పెంచారు. ఆ ధరలకు అమలుకాని పెద్ద మెనూ పెట్టి ఇటు వార్డెన్లను... అటు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారు.

నెలనెలా డైట్ బిల్లులు అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా మూడు నెలలకోసారి... ఆరునెలలకోసారి డైట్ బిల్లులు అందించింది. అప్పులు తెచ్చి డైట్ అమలు చేయలేక వార్డెన్లు ఇబ్బందులు పడ్డారు. ఇటు విద్యార్థులకూ పౌష్టికాహారం కరువైంది. ఇక నెలనెలా వసతిగృహాల్లోని విద్యార్థులకు నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు అటకెక్కాయి. విద్యార్థులు దగ్గొచ్చినా... జ్వరమొచ్చినా వైద్యం అందకపోవడంతో.. వారు ఇళ్లకు వెళ్లారు. ఇలా ఎటు చూసినా ఐదేళ్ల వైసీపీలో పాలనలో సంక్షేమ వసతిగృహాలు నిర్వీర్యం కావడంతో పాటు... విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య వైద్యం అందడం లేదు. ఫలితంగా ఎంతో మంది పేద విద్యార్థులు అరకొర వసతుల మధ్యనే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లబుచ్చాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నాడు-నేడుతో కాలయాపన...

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న వసతిగృహాలకు మరమ్మత్తులు కరువయ్యాయి. మరమ్మత్తులకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో పదుల సంఖ్యలో వసతిగృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటికి నాడు-నేడు పథకం కింద మరమ్మతులు చేపట్టకుండా... కాలయాపన చేశారు. జిల్లాలో బీసీ సంక్షేమశాఖ అధికారులు 32 వసతి గృహాలను, ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి దాదాపు 36 వసతిగృహాలను మరమ్మత్తుల కోసం, ఎస్టీ సంక్షేమశాఖలో రెండు వసతిగృహాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలను ఎంపికచేసి నివేదికలు పంపారు. ఆ నివేదికలు పంపి రెండేళ్లు పూర్తయింది. ఇంత వరకూ ఆ నాడు-నేడు ఏమైందో ఎవరికి అర్థంకాని పరిస్థితిగా మారింది. కనీసం నీటి సౌకర్యం, మెస్ తదితర సౌకర్యాలు కరువయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో హాస్టల్‌కు రూ.50వేల వరకూ మెయింటెనెన్స్ విడుదల చేసేంది.




శిథిలావస్థలో గుత్తి కొండ కింద ఉన్న బీసీ బాలుర వసతిగృహం, కంబదూరు బీసీ బాలుర వసతిగృహం, నగరంలోని కూలిన హాస్టల్ ప్రహరి

కనీస వసతులు కల్పించకుండా శిక్షణ

నీరు, నీడ కూడా లేకపోవడంపై నిలదీసిన తల్లిదండ్రులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కనీస వసతులు లేని శిక్షణ... క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. సోమవారం పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలతో జేఎన్‌టీయూకు సిబ్బందికి వస్తారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన గదులలో వరుసగా ఉంచేందుకు వాహనాల ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడటానికి క్రీడాకారులను నియమించారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు, కోచ్‌లకు ట్రాఫిక్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ఇచ్చిన అధికారులు వారికి కనీస వసతులు కల్పించడం మరిచారు. దీంతో క్రీడాకారులు, కోచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడాకారుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని... వారి దుస్థితిని చూసి మండిపడ్డారు. అసలే ఎండాకాలం కనీసం మంచినీరు, భోజనం, నీడ వసతులు లేకుండా ఎలా శిక్షణ ఇస్తారని అధికారులను నిలదీశారు. దీంతో సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో క్రీడాకారులను అక్కడ నుంచి పంపించేశారు. తిరిగి సోమవారం ఉదయం జేఎన్‌టీయూలో ట్రాఫిక్ నిర్వహణకు రావాలని అధికారులు సూచించారు. పిల్లలకు ఎటువంటి రెమ్యునరేషన్, వసతులు లేకుండా నిర్లక్ష్యంగా జేఎన్‌టీయూ ట్రాఫిక్ నిర్వహణకు నియమించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అక్కడ ఉన్న అధికారులు... జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అయితే ఈ తతంగం మొత్తం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్ళారో... లేదో అనేది సందేహం. క్రీడాకారుల తల్లిదండ్రులు మాత్రం ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.


ఆకలిగా ఉంది.. అన్నం పెట్టండని అడుగుతున్న క్రీడాకారులు

రేపట్నుంచి ఏపీఎల్ క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 12: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీలు మంగళవారం నుంచి ఈనెల 21 వరకు అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. మొత్తం ఐదు జట్లు యునైటెడ్ చాంపియన్స్ క్రికెట్ క్లబ్, ఫ్యామిలీ క్లబ్, దినేష్ గ్రానైట్స్, అనంత రైజింగ్ స్టార్స్, ఇండియన్ సిక్సర్స్ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు.

రాత్రి వేళ వైసీపీ ప్రచారం

అనంతపురం సెంట్రల్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి వేళ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రుద్రంపేట పంచాయతీ పరిధిలో నమూనా ఈవీఎంతో ప్రచారం నిర్వహిస్తూ... డబ్బులు పంచారు. వైసీపీకే ఓటు వేయాలని, ఏమైనా అనుమానాలుంటే అక్కడ మనవాళ్లే ఉంటారని చెబుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ వారి కంటపడకుండా జాగ్రత్తగా ప్రచారం చేపట్టారు.


బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

ఎలాగైనా ఓటు వేయాల్సిందే..!

- ఎన్నికలకు బస్సుల కేటాయింపు
- సొంత గ్రామాలకు వెళ్లేందుకు ఓటర్ల పాట్లు

స్వగ్రామాల్లో ఓట్లు వేసేందుకు బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వందలాదిగా ఓటర్లు స్థానిక బస్టాండుకు చేరుకున్నారు. రీజియన్ వ్యాప్తంగా 857 ఆర్టీసీ బస్సులుండగా ఎన్నికల విధుల కోసం 272 బస్సులను కేటాయించారు. దీంతో పలు రూట్లలో బస్సులను రద్దీ చేశారు. వివిధ రూట్లలో బస్సు సర్వీసులు తక్కువ కావడంతో ప్రయాణికులు, పోలింగ్ సిబ్బంది, ఓటర్లు వేచిచూడక తప్పలేదు. బస్సురాగానే ఒక్కసారిగా సీట్ల కోసం వారు పరుగులు తీశారు. సీట్ల కోసం పోటీ పడ్డారు. మరికొన్ని బస్సులు బస్టాండ్ ఆవరణంలో నిలిపి ఉండగానే ప్రయాణికులు వెళ్లి... సీట్ల కోసం పోటీపడ్డారు. యువకులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి బస్సు టాప్‌లపై ఎక్కి మరీ వారివారి స్వగ్రామాలకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన ఒక్క వర్షానికే బస్టాండు ఆవరణంలో వర్షపు నీటితో పాటు చెత్తాచెదారంతో పేరుకుపోయింది.

- అనంతపురం కల్చరల్


బస్సు టాపుపై ఎక్కిన యువకులు


బస్సులో సీట్ల కోసం ఫీట్లు


బస్సు ప్లాట్‌ఫాం వద్దకు రాకముందే..





ఆవరణలో నిలిచిన వర్షపు నీరు


సీట్ల కోసం ఉరుకులు.. పరుగులు..

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

అనంతపురం టౌన్, మే 12: స్థానిక జేఎన్‌టీయూలో కలెక్టరు వినోద్ కుమార్ కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరచే స్ట్రాంగ్ రూమ్స్‌ను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లు నిబంధనల మేరకు పక్కాగా ఉండాలని ఆదేశించారు. ప్రతి బ్లాక్‌లో కంట్రోల్ రూమ్ ఉండాలని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం తపోవనంలో ప్రత్యేకంగా మహిళా ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.


కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టరు

ఆలోచించి.. ఓటు వేయండి

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, బటన్ నొక్కండి

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం అర్బన్, మే 12: అనంత ప్రజలారా ఆలోచించి ఓటు వేయండి.. మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈవీఎం బటన్ నొక్కాలని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. అనంతపురం అర్బన్ నియోజక వర్గం లోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలన్నారు. తాను రాజకీయాలు చేయడానికో... డబ్బులు సంపాదిం చుకునేందుకో ఇక్కడికి రాలేదని.. అనంత నగరం ఎంతో ఇచ్చిందని, ఈ ప్రాంతానికి సేవ చేసేందుకు వచ్చా నని అన్నారు. ప్రజలంతా ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశా రు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మంచి వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. నగరాన్ని ఎవరైతే అభి వృద్ధి చేస్తారో.. ఎవరైతే ప్రజలకు అండగా ఉంటారో అలాంటి వ్యక్తిని ఎన్నుకోవాలని సూ చించారు. చదువుకున్న వ్యక్తులు, ఉద్యోగులు, మేధావులు, పెన్షనర్లు, ఓటు హక్కు కలి గిన విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ఓటింగ్‌లో పాల్గొని స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

నేత్రపర్వంగా శంకర జయంతి


నగరోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, మే 12: జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, జిల్లా బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ఆవరణంలో శంకరాచార్యుల విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రథంలో శంకరాచార్యుల చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో శంకరాచార్యులకు విశేష పూజలు నిర్వహించడంతోపాటు భక్తులు శంకర పారాయణం నిర్వహించారు.

టీడీపీలోకి చేరిక

చెన్నేకొత్తపల్లి, మే 12: మండలంలోని నామాల గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీలోకి చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సమక్షంలో గ్రామానికి చెందిన మల్లన్న, ఎర్రమల్లేశు, పెద్దమల్లన్న, నాగరాజు, వెంకటేశ్ తదితరులు పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు



అనంతపురంలో గిల్డ్ ఆఫ్ సర్వీసు స్కూల్‌లో వేసిన ఒకటే షామియాన, నారాయణపురం పంచాయతీ తపోవనం పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

పోలింగ్ కేంద్రాల్లో అరకొర వసతులు

అనంతపురం విద్య, మే 12 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనుంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం పోలింగ్ ఏర్పాట్లు చేశారు. అయితే నగరంలోని పలు కేంద్రాల్లో కనీసం కుర్చీలు కూడా అందుబాటులో ఉంచలేదు. సీసీ కెమెరాలు కొన్ని కేంద్రాల్లో మాత్రమే ఏర్పాటు చేశారు. ఆదిమూర్తి నగర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఒకే ఒక్క షామియాన ఏర్పాటు చేసి.. రెండు బెంచీలు పెట్టి.. చేతులు దులుపుకున్నారు. కుర్చీలు అందుబాటులో పెట్టలేదు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

అనంతపురంరూరల్ : మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపు పనులు పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద షామియాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఫిర్యాదులు, సందేహాల నివృత్తికి పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ అధికారి పేరు, సెల్ నెంబరుతో పాటు బీఎల్‌ఓ, ఎస్‌ఓ, ఎస్‌ఐ, ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ ఫోన్ నెంబర్లను పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామన్నారు.

బుక్కరాయసముద్రం: నియోజకవర్గంలో 168 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని, వాటిల్లో వెబ్‌కాస్టింగ్ ఓటింగ్ ఏర్పాటు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నల శీను తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వెబ్‌కాస్టింగ్ ఓటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని, నియోజకవర్గంలో 2,47,343 మంది ఓటర్ల కోసం 294 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. నియోజవర్గం ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే... ఆస్థానంలో 15 నిమిషాల్లోగా రీప్లేస్ చేసి కొత్త ఈవీఎం ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్‌కు 2100 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు.

చెన్నేకొత్తపల్లి : మండలంలో సోమవారం నిర్వహించే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 37,114 ఓటర్లు ఉండగా మొత్తం 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలీసుల బందోబస్తు మధ్య ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఇద్దరు డీఎస్పీలు, సీఐ, ఇద్దరు ఎస్ఐలు 15 మంది ఆర్మ్డు రిజర్వ్‌వెపన్ పార్టీ, బీఎస్ఎఫ్ 45 మంది, కర్ణాటక హోంగార్డ్సు 15 మంది, 15 మంది పీసీలు, ఆరుగురు ఏఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అయితే చెన్నేకొత్తపల్లి పోలింగ్ కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవని పలువురు సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాప్తాడు : నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం నిర్వహించే ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి వసంతబాబు తెలిపారు. మొత్తం 281 పోలింగ్ స్టేషన్‌లకు 562 ఈవీఎంలు పంపిణీ చేశామన్నారు. 72 బస్సుల్లో అన్ని పోలింగ్ స్టేషన్‌లకు ఈవీఎంలు, ఇతర సామగ్రిని తరలించామన్నారు. 281 పోలింగ్ స్టేషన్‌లకు మొత్తం 4,125 మంది ఎన్నికల సిబ్బందిని నియమించామన్నారు. సాయంత్రం 4 గంటలకు సిబ్బంది పోలింగ్ స్టేషన్‌లకు చేరుకున్నారన్నారు.

రామగిరి : అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్ధం చేశారు. భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మండలంలో 29,396 మంది ఓటర్లు ఉండగా... 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆత్మకూరు : మండలంలో జరి గే సార్వత్రిక ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 33,264 మంది ఓటర్లు ఉండగా... 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.




సీకేపల్లిలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటున్న సిబ్బంది, రాప్తాడు, రామగిరి పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది

పూర్వ విద్యార్థుల చేయూత


నేలకోటప్ప తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

చెన్నేకొత్తపల్లి, మే 12: మండలంలోని కనుముక్కల ఉన్నతపాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థులు ఓ విద్యావలంటీర్ కుటుంబానికి చేయూతనందించారు. గ్రామానికి చెందిన నేలకోటప్ప గతంలో స్థానిక ఉన్నతపాఠశాలలో విద్యావలంటీర్‌గా పనిచేస్తుండేవాడు. అనారోగ్యంతో పది రోజుల క్రితం అతను మరణించాడు. దీంతో తమకు విద్యనేర్పిన గురువు మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి 2000-2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ముందుకు వచ్చారు. వారంత స్వచ్ఛందంగా విరాళాలతో రూ.50 వేలు నగదు సేకరించారు. ఆ నగదును ఆదివారం నేలకోటప్ప తల్లిదండ్రులు నాగమ్మ, యల్లప్ప, భార్య పావనికి అందజేశారు.

అటవీ స్థలాల్లో యథేచ్ఛగా మట్టి తరలింపు

అనంతపురం న్యూటౌన్: జిల్లాలో అటవీ స్థలాల్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయారు. దీంతో అటవీ సంపద అవినీతిపరుల పాలిట కల్పతరువైంది. అటవీ శాఖ స్థలాల్లో వనరులను ఏ ఒక్కటీ ఆ శాఖ అనుమతి లేకుండా తరలించడానికి వీలులేదు. పొరపాటున అలా తరలిస్తుండగా పట్టుపడితే శాఖ పరంగా అపరాధ రుసుం విధించి ముప్పతిప్పలు పెడతారు.

అయితే కొన్న ప్రాంతాల్లో మాత్రం సిబ్బంది స్థాని క నాయకులతో కుమ్మక్కై అటవీ వనరులను ఎక్కడికక్కడ హరి స్తున్నారు. ప్రధానంగా అడ్డూ అదుపులేకుండా మట్టిని తరలిస్తు న్నారు. అటవీ ప్రాంతాల్లో మట్టి తరలింపునకు ఎట్టిపరిస్థితుల్లోనూ అను మతు లు ఇవ్వరు. అలాంటిది ఎలాంటి అనుమతులూ లేకుండానే మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారు. మరుట్ల బీట్‌లో పెనకచర్ల డ్యాం పరిసర ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా మట్టిని తరలించడంతో పాటు అటవీ స్థలాలను ఆక్రమించుకున్నట్లు ఆరోపణ లున్నాయి. ఇలా అటవీ స్థలాలు కబ్జాకు గురవుతున్నా... అక్కడ క్షేత్రస్థాయి సిబ్బంది నిమ్మకుండిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో క్షేత్ర స్థాయి సిబ్బంది అక్రమాలకు అంతేలేకుండా పోతోందనే ఆరోపణలు భా రీగా వస్తున్నాయి. ఇప్పటికైన డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ స్పందించి క్షేత్ర స్థాయి లో జరిగే అక్రమాలకు అడ్డుకట్టవేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వసతుల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

● అసిస్టెంట్ కలెక్టర్ మందలింపుతో చలనం



యాడికిలో ర్యాంప్ ఏర్పాటు కోసం పనులు చేపడుతున్న దృశ్యం

యాడికి, మే12: పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఓటర్ల క్యూలైన్ల కోసం బారికేడ్ల ఏర్పాటు, నీడకోసం షామియానాల ఏర్పాటులో నిర్లక్ష్యం వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పోలింగ్ కేంద్రాల వద్ద వసతుల కల్పనపై పర్యవేక్షించడంతో లోపాలు బయటపడ్డాయి. సిబ్బంది తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారుల్లో చలనం వచ్చింది. యాడికి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 5:30గంటల సమయంలో బారికేడ్ల ఏర్పాటు చేయడం కనిపించింది. ర్యాంప్‌ల పనులు అప్పటికప్పుడు చేపడుతుండడం కనిపించింది.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని జడ్పీపాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పరిశీలించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రతరంగా ఉండడం వల్ల తాగునీరు, పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు ఏర్పాటు చేయడంతోపాటు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

ఈవీఎంల పంపిణీపై కలెక్టర్ ఆరా

గుంతకల్లుటౌన్, మే 12: నియోజకవర్గంలో ఈవీఎంల పంపిణీపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆరా తీశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని ఆదివారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ సందర్భంగా ఈవీఎంల పంపిణీ ఎలా జరిగింది?, సమాయానికి ఎన్నికల సిబ్బంది ఇక్కడికి చేరుకున్నారా, వేళకు ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించారా అని ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

పోలింగ్ సిబ్బందికి కరువైన కనీస వసతులు

● టాయిలెట్లు లేక మహిళా సిబ్బంది అవస్థలు



ఈవీఎంలను తీసుకువెళ్లడానికి వచ్చిన సిబ్బంది

తాడిపత్రి టౌన్, మే 12: నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భద్రపరిచారు. సోమవారం ఎన్నికలు జరగనుండడంతో పోలింగ్ కేంద్రాల వద్దకు ఈవీఎంలను తరలించేందుకు సిబ్బంది అంతా ఆదివారం కళాశాల వద్దకు చేరుకున్నారు. ఇక్కడ సిబ్బందికి కనీస వసతులు లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. మహిళలకు టాయిలెట్ల సౌకర్యం కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 4వేలమంది సిబ్బందికి కేవలం రెండు టాయిలెట్లు ఉండడంతో వారి ఇబ్బందులు ఏమిటో అర్థమవుతుంది. ఆ టాయిలెట్లలో కూడా నీరు రాకపోవడంతో కొంతమంది సిబ్బంది బహిర్భూమికి వెళ్లడం కనిపించింది.

3,028 అదనపు ఓట్లు

గుంతకల్లు, మే 12: నియోజకవర్గంలో 2,70,648 ఓటర్లు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తుది జాబితా తర్వాత జరిగిన ఓటరు నమోదులో 3,028 అదనపు ఓట్లు వచ్చి చేరాయి. ఏప్రిల్‌లో 2,67,036 ఓట్లు ఉండగా, పెంచిన గడువు, నూతన ఓట్ల నమోదుకు కల్పించిన అదనపు అవకాశంతో 3,028 ఓట్లు అదనంగా వచ్చాయి. ఈ మేరకు నియోజకవర్గంలో 1,32,943 మంది పురుషులు, 1,37,630 మంది స్త్రీలు, 75 మంది ట్రాన్స్ జెండర్లు కలసి మొత్తం 2,70,648 ఓట్లు ఉన్నాయి. కులాల వారిగా చూస్తే వాల్మీకులు 42 వేలు, ఎస్సీ-ఎస్టీలు 29 వేలు, ముస్లిం మైనార్టీలు 32 వేలు, ఎస్టీలు 11 వేలు, యాదవులు 22 వేలు, క్రైస్తవులు, కమ్మలు, వడ్డెర్లు ఒక్కో కులంలో ఎనిమిది వేల పైచిలుకు ఓట్లు కలిగి ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం 276 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది.

పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత



పోలింగ్ బూత్ వద్ద గుమిగూడిన రాజకీయ పార్టీల నాయకులు

గుత్తి, మే 12: పట్టణంలోని బాహర్ పేట్ ఉర్దూ పాఠశాలలో ఏర్పాటుచేసిన 182వ పోలింగ్ కేంద్రం వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నికల అధికారులు సోమవారం ఉదయం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బాక్సు నుంచి ఈవీఎంలను బయటకు తీయాల్సి ఉండగా ఏపీఓ హేమచంద్రారెడ్డి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఈవీఎం సీల్‌ను తొలగించారు. దీంతో అక్కడ ఉన్న రాజకీయ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న టీడీపీ, వైసీపీ నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈవీఎంను వెంటనే తొలగించి, మరొకదాన్ని ఏర్పాటుచేయాలని, సంబంధిత అధికారిని డిమాండ్ చేశారు. సీఐ వెంకట రామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరుపార్టీలవారిని చెదరగొట్టారు. పోలింగ్ సమయంలోపే తెరచిన ఈవీఎం స్థానంలో మరొక్కదానిని ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బొమ్మనహాళ్, మే 12: మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాలకు చెందిన ఇద్దరి వ్యక్తుల నుంచి ఆదివారం కణేకల్లు సెబ్ పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. కణేకల్లు సెబ్ సీఐ కిషోర్ తెలిపిన మేరకు శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన కే నాగరాజు అనే వ్యక్తి 384 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకుని వస్తుండగా, ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన బీ హనుమంతు నుంచి 768 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా మద్యం వ్యాపారం చేస్తున్న కీలక వ్యక్తిని వదిలేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వైసీపీ కార్యకర్త కావడంతో మద్యం వ్యాపారం చేస్తున్నాడని తెలిసి కేసు నమోదు చేయకుండా వదిలేసినట్లు తెలిసింది. కీలక వ్యక్తి ఆదేశాలతోనే మద్యం బాక్సులను తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై కేసు నమోదు చేయకుండా వ్యక్తిని వదిలేశారని సీఐ కిషోర్‌ను వివరణ కోరగా ఇద్దరు వ్యక్తులు మాత్రమే దొరికారని ఎవరిని వదిలింది లేదన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు

ఉరవకొండ,మే12: పట్టణంలోని ఎనిమిది మంది వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 5వ తేదీన ఉరవకొండలో ప్రచారానికి వెళ్లిన ముస్లిం మహిళలను వైసీపీ నాయకులు అడ్డుకుని, దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వైసీపీకి చెందిన వడ్ల సలీం, తాజు, అన్వర్, మైనూ, జాకీర్, జిలాన్, ఇర్ఫాన్, నూర్ పైన పోలీసులు 324, 341, 355 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

● జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

రాయదుర్గం, మే 12: ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎన్నికల సిబ్బందికి అప్పగించే బాధ్యతలను రిటర్నింగ్ అధికారి, జేసీ ఆధ్వర్యంలో సమర్పించారు. 2,64,352 ఓట్లకు ఎన్నికలు నిర్వహించేలా 296 కేంద్రాలను ఏర్పాటు చేసి బస్సులు, క్రూజర్ల వాహనాలలో తరలించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3,321 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టిభద్రత ఏర్పాట్లను చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన అధికారులు ఉదయం నుంచి మండుటెండల్లో పడిగాపులు కాశారు.

అసౌకర్యాల మధ్య సామాగ్రి పంపిణీ: అసౌకర్యాల నడుమ ఎన్నికల సామగ్రి పంపిణీ జరిగింది. దీంతో ఎన్నికల విధులకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడం పెదవి విరిచారు. పట్టణంలోని మోడల్ స్కూల్ వద్ద నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తీసుకెళ్లేందుకు వచ్చిన ప్రిసైడింగ్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు: పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్లను ఆదివారం రాత్రి చేరుకున్నాయి. విధుల నిర్వహణ కోసం అవసరమైన బస్సులు, జీపులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి వాటిలో సాయంత్రం 6 గంటల కల్లా ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. రిటర్నింగ్ అధికారి కరుణకుమారి పాటు సహాయక రిటర్నింగ్ అధికారులు ఉదయం నుంచి విధుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలతో పాటు జోన్, రూట్ అధికారులు జూనియర్ కళాశాల మైదానంలోకి చేరుకున్నారు. తెల్లవారుజామున 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు.

రాయదుర్గంరూరల్: మండలంలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి అయినట్లు అర్ఓ కరుణకుమారి తెలిపారు. మండలంలో 39 పోలింగ్‌బూత్‌లకు గాను 34,548 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నట్లు తెలిపారు.

ఉరవకొండ: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు



ఉరవకొండలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గం డీఆర్సీ(డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్)ను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకే పీవో, ఏపీవోలు, ఓపీవోలకు కేటాయించిన కౌంటర్‌లో రిపోర్ట్ చేశారు. 32 కౌంటర్ల ద్వారా ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని ఈవీఎంలు పంపిణీ చేశారు. మధ్యాహ్నానికి డీఆర్సీ కేంద్రం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. పంపిణీ ఏర్పాట్లను ఆర్వో, జేసీ కేతన్‌గార్గ్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 263పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేశామన్నారు. ఎన్నికలకు 2800మంది సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేస్తుండగా, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించే దిశగా అదనపు బలగాలను మోహరిస్తున్నారు. 1200 మంది పోలీస్‌అధికారులు, సిబ్బందిని బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు. మొత్తం 150 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుంతకల్లుటౌన్: సార్వత్రిక ఎన్నిలలో భాగంగా సోమవారం జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగనుంది. స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం ఈవీఎం, వీవీప్యాడ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్వో శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఈవీఎం, వీవీప్యాడ్‌లతో ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పోలీస్ బందోబస్తు మధ్య బస్సుల్లో తరలించారు. నియోజకవర్గం మొత్తం 2,70,648 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



గుంతకల్లులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

బొమ్మనహాళ్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో మండలంలో పోలింగ్‌స్టేషన్‌లలో అధికారులు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 58 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఓటర్లు 46,680 ఓటర్లు తహసీల్దార్ రామాంజినమ్మ తెలిపారు.

పుట్లూరు: మండలంలో ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మల్లికార్జున స్వామి తెలిపారు. 39పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో 31005మంది ఓటర్లు ఉండగా పురుషులు 15625, స్త్రీలు 15380 మంది ఉన్నారు. ఎన్నికలకు ఐదుగురు రూట్‌ఆఫీసర్లు, 300మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

యల్లనూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర బలగాలతో కలిపి పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. మండలంలో ఏడు గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామన్నారు. యల్లనూరు, వెన్నపూసపల్లి, ఆరవేడు, నీర్జాంపల్లి, దంతలపల్లి, తిమ్మంపల్లి, బొప్పేపల్లి గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తాడిపత్రిటౌన్: ఎన్నికలకు సంబంధించి బందోబస్తు కోసం భారీగా పోలీసు బలగాలను ఏర్పాటుచేశారు. తాడిపత్రి ప్రాంతం సమస్యాత్మకం కావడంతో పోలీసు అధికారులు కేంద్రబలగాల సాయంతో తాడిపత్రిని తమ అధీనంలోకి తీసుకున్నారు. నియోజకవర్గానికి సంబంధించి 272 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 86 సమస్యాత్మకంగా ఉన్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం స్థానిక పోలీసులతోపాటు ఇండియన్‌ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసులు దాదాపు 4వేలమంది విధుల్లో పాల్గొననున్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించే ఎన్నికలకు ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. 45 పోలింగ్ కేంద్రాలలో 39,908 ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

బెళుగుప్ప: మండలంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు



బెళుగుప్పలో సిద్ధం చేసిన బారికేడ్లు

అధికారులు సర్వం సిద్ధం చేశారు. పండుగలా జరుపుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ముగ్గులు వేశారు. 36,836 మంది ఓటర్లు వుండగా 43 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్నారు. 430 పోలింగ్ సిబ్బంది పాల్గొంటారని తహసీల్దార్ హరినాథరావు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్ అమలు చూసి ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. మండలంలోని తగ్గుపర్తి, వెంకటాద్రిపల్లి, కోనాపురం, బెళుగుప్ప ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలలో కేంద్ర బలగాల సిబ్బందితో నిర్వహించనున్నారు.



కళ్యాణదుర్గంలో ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో



రాయదుర్గంలో ఈవీఎం పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

డీ.హీరేహాళ్: మండల వ్యాప్తంగా 16 పంచాయతీలకు 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 36,853 ఓటర్లు ఉన్నారు. గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈవీఎంల పంపిణీ కేంద్రం తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్: కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని జిల్లా పరిషత్ సీఈవో వైభోమ్ నిదియాదేవి ఆదివారం తనిఖీ చేశారు. ఈవీఎంలు పకడ్బందీగా పోలింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యాలు, తాగునీరు, భోజన ఏర్పాట్లు తదితర సౌకర్యాలపై ఆరా తీయాలన్నారు.

బ్రహ్మసముద్రం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్ధం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన, పోలింగ్ సిబ్బంది ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో దాసా నాయక్ తెలిపారు. అలాగే మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పరశురాముడు తెలిపారు.

కణేకల్లు: మండల వ్యాప్తంగా సోమవారం జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఇందిరాదేవి తెలిపారు. మొత్తం 62 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 52,126 మంది ఓటర్లు ఉండగా పురుషులు 25,696, మహిళలు 25426తో పాటు మరో నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు పరచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు

కళ్యాణదుర్గంరూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను ఎన్నికల పరికరాలను ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులకు అందజేసి బస్సుల్లో పంపించారు. సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఆర్‌వోలు తహసీల్దార్లు, 20 మంది కంట్రోల్ రూమ్ సిబ్బంది, 15 మంది సాంకేతిక సిబ్బంది, 251 పీవోలు, 261 ఏపీవోలు, 1044 ఓపీఓలు, 44 వీడియో గ్రాఫర్లు, 45 నాక్ అబ్జర్వర్లు, 25 సెక్టర్ ఆఫీసర్లు, 25 రూట్ ఆఫీసర్లు, 261 ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, 261 బీఎల్‌వోలు, 25 సెక్టర్ పోలీస్ ఆఫీసర్‌లు, 3 బెల్ ఇంజనీర్లు, ఎనిమిది సెక్షన్ల సీఏపీఎఫ్‌లు, రాష్ట్ర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పీఈఎంఎస్, సమర్థ్ లాంటి అప్లికేషన్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్‌తో పాటు 261 పోలింగ్ కేంద్రాలకు వెబ్ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్‌వో రాణి సుస్మిత తెలిపారు. ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న 125 ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను నియోజకవర్గ పరిశీలకులు అజయ్‌నాథ్, జడ్పీసీఈవో వైభోమ్ నిదియా దేవి ప్రశంసించారు.



పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో రాణి సుస్మిత

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి: కలెక్టర్

గుత్తి, మే 12: ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, తొండపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదివారం సాయంత్రం వారు పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 173, 174, 175 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ కేంద్రాలలో 118 సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఇతర సామగ్రితో పాటు పోలింగ్ అధికారులు ఆయా కేంద్రాలకు చేరుకున్నారన్నారు. ఈవీఎంలు సాంకేతిక సమస్యలు ఎదురైనా 20 నిమిషాల్లో మరో ఈవీఎం ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 3 వేల మందికిపైగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వీరి వెంట సీఐ వెంకటరామిరెడ్డి, తహసీల్దారు భారతి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుత్తిరూరల్: మండలంలోని తొండపాడు గ్రామ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో వసతులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యలయానికి వచ్చి ఇక్కడ సమస్యలను డిప్యూటీ తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యలు కల్పించామని వారు తెలిపారు.

మార్కెట్ సెస్సు రైతులకు భారం

బొమ్మనహాళ్, మే 12: మార్కెట్ సెస్సు వసూలు ప్రభావం రైతులపై పడుతోంది. పన్ను విధింపు ఎగుమతి దారులపైనే అన్నా అది అన్నదాతలపైనే పడుతుందన్న ఆందోళన నెలకొంది. బొమ్మనహాళ్ మండలంలో రబీసీజన్‌లో సాగైన వరిపంట ధాన్యం రావడంతో మార్కెట్ అధికారులు సెస్సు రూపంలో వసూలు చేస్తున్నారు. వరిసాగు చేసిన రైతులకు మద్దతు ధర దక్కకపోవడం, దళారుల దందాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైతులపై మార్కెట్‌సెస్సు మరింత భారం పడుతుండడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొమ్మనహాళ్ కర్ణాటకకు సరిహద్దున ఉండడంతో ఇక్కడి ధాన్యం కర్ణాటకలోని బళ్లారి, కాటిగె, గంగావతి ప్రాంతాలకు ఎగుమతి అవుతుండగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినవారు కర్ణాటకకు తరలించి విక్రయిస్తున్నారు. దానికి వారి నుంచి మార్కెట్‌శాఖ సెస్సు వసూలు చేస్తోంది. వంద విలువ చేసే ధాన్యం ఎగుమతులపై ఒక్క రూపాయి సెస్సు వసూలు చేస్తున్నారు. క్వింటాలు ధాన్యంపై రూ.100 నుంచి రూ.200 వరకు సెస్సు వసూలు చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల చెక్‌పోస్టుల ద్వారా ఎగుమతులపై పన్ను వసూలు చేస్తోంది. పెంచిన పన్నులు ఎగుమతిదారులపై పడుతోంది. వారు ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు రైతులపైనే పడతారు. ధాన్యం మార్కెట్ ధర కన్నా తక్కువగా కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర రూ.2,600 ఉంటే రూ.2,300, రూ.2,400 ధరలతో కొనుగోలు చేసి రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు మార్కెట్‌శాఖ సెస్సు ఎత్తేస్తే వ్యాపారులు ఎక్కువ ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని అన్నారు. అధికారుల చొరవ చూపి మార్కెట్ సెస్సును ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ధాన్యం లోడ్ చేస్తున్న హమాలీలు

మోసం చేసే వారిని నమ్మకండి

● రాయదుర్గం నియోజకవర్గ ప్రజలకు కాపు విజ్ఞప్తి

రాయదుర్గంరూరల్, మే 12: మోసం చేసేవారిని నమ్మ వద్దని, నా ఆత్మాభిమానాన్ని గౌరవించాలని రాయదుర్గం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 20 ఏళ్లుగా సేవలు చేసినందుకే నన్ను మూడుసార్లు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గుర్తింపు ఇచ్చారన్నారు. వారికి ఎంతో రుణపడి ఉన్నానని, ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదుకున్న ఘనత ఒక్క నాకే ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నన్ను గుర్తించి మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారన్నారు. గతంలో చేసిన సేవా కార్యక్రమాలు వల్ల రాయదుర్గం ప్రజలకు నాపై ఎంతో అభిమానం ఉందన్నారు. 2024లో టికెట్ రాకపోవడం నన్ను గుర్తించకపోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నాకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. ఒక్కసారి ఆలోచించండి మంచి నాయకుడిని ఎన్నుకోవాలంటే, ధర్మాన్ని కాపాడాలంటే సేవలు చేసే వారికే పట్టం కట్టాలే తప్ప నియోజకవర్గ ప్రజలు ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టే నాయకులను ఎన్నుకోకూడదని హితవు పలికారు. మాజీ రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ పాల శ్రీనివాసులు, వాల్మీకి మల్లికార్జున, జగతి కిష్ట, కసందుల కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

రిజర్వ్ సిబ్బంది ఆందోళన



అధికారులతో వాగ్వాదం చేస్తున్న ఎన్నికల మహిళ సిబ్బంది

ఉరవకొండ,మే12: పోలింగ్ రిజర్వ్ సిబ్బంది ఆందోళనకు దిగారు. పోలింగ్ రోజున రిజర్వ్ స్టాఫ్ రావాలని అధికారులు ఆదేశించారు. ఉదయం నుంచే రిజర్వ్ సిబ్బంది డీఆర్సీ కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. రిజర్వ్‌స్టాఫ్‌కు పోలింగ్ కేంద్రాలను అధికారులు కేటాయించలేదు. మీ అవసరం లేదని తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. ఈ సమయంలో వెళ్లిపోవాలని చెప్పడంతో రవాణా సౌకర్యం కూడా లేదని, తాము ఎలా వెళ్లాలంటూ అధికారులతో సిబ్బంది వాగ్వాదానికి దిగారు. అనంతపురం వరకూ మాత్రమే బస్సు సౌకర్యం కల్పిస్తామంటే మిగిలిన ప్రాంతాలకు ఎలా వెళ్లాలని అధికారులను నిలదీశారు. అధికారుల తీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. అనంతపురం నుంచి తాడిపత్రి, శింగనమల, రాయదుర్గం ప్రాంతాలకు ఎలా వెళ్లేదని మహిళా సిబ్బంది వాపోయారు. ప్రత్యామ్నాయ చర్యలు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో విరమించారు.

పోలింగ్ కేంద్రాల వద్దే చికెన్, మటన్..!

పుట్లూరు, మే 12: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద కొందరు అధికారపార్టీ నాయకులు చికెన్, మటన్ వండించి అధికార దర్పం చూపించేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. సోమవారం నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదేతంతు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రం శివార్లలో ఎటువంటి వంటకాలు, పలు పార్టీల నాయకులు తిష్టవేయరాదన్న నిబంధన ఉంది. కానీ వీటిని తుంగలో తొక్కి. పోలింగ్ కేంద్రం వద్దే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు చికెన్, మటన్ వంటకాలతో వారిని ఆకర్షించే ప్రయత్నం చేయనున్నట్లు తెలిసింది.

19న ఉచిత కంటి వైద్యశిబిరం

తాడిపత్రిటౌన్, మే 12: స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో 19వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిరాం కంటి ఆసుపత్రి వైద్యులు శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9440201044 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళ ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, మే12: మండలంలోని ఎన్ వెంకటాంపల్లి తండా గ్రామానికి చెంది న మంజులా బాయి(25)అనే మహిళ ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కు టుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మంజులబాయి, ఆమె భర్త అంంజనేయులనాయక్ ఉదయం డబ్బు విషయ మై ఇంట్లో చిన్నపాటి గొడవ ప డ్డారన్నారు. కొద్దిసేపటి తరువా త ఇంట్లో నుంచి అంజనేయులనాయక్ బయటకు వెళ్లాడన్నా రు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మంజులాబాయికి ఆరు నెలల పాప ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.